నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

మూగవేదన
దాహపు మృత్యువాత
నీటి ఎద్దడి.

బడి గంటలు
తార్కిక మనోధైర్యం
విద్యా జ్ఞానాలు.

స్మార్టు చేకర్ర
కిషాను మిత్రభడి
చీడ దర్శిని.

సూపర్ ఎల్ నినో
భగభగల కాలం
జీవసంకటం

రైతుల లొల్లీ
మేలుచేసె నీరుల్లీ
రేటుకు చిల్లీ.



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com


**శ్రీనిజాలు**

ప్రియతమ ఉపముఖ్యమంత్రి
ఇచట విక్రమార్క భట్టి !
మా అయ్యా జాగీరే
ఇది తెలంగాణ మట్టి !
పాకిస్తాన్ పాలస్తీన్
పవన్ అటుపక్కన పెట్టు !
ఆంధ్ర తెలంగాణ రెండు
తెలుగొకటే కాలు పెట్టు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 4-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:236 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు సీఎం పర్యటన



మహబూబ్‌నగర్, జూన్ 3:జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించను న్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని పోలీస్ శాఖ అప్రమత్తమైంది. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఐపీఎస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, హెలిప్యాడ్ ప్రాంతం, సభా స్థలం, ఇతర ముఖ్య ప్రదేశాలను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సీఎం పర్యటన సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సీఎం పర్యటనలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మార్గదర్శక ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి పర్యటించే ప్రాంతాల వరకు అన్ని చోట్ల భద్రతా చర్యలు చేపడు తున్నట్లు పోలీస్ శాఖ తెలిపింది. పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించనున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు పలు ప్రాజెక్టుల పెండింగ్ పనుల పరిశీలనకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల (4, 5న) పర్యటన ఖరారైంది. తొలిరోజు గురువారం కర్ణాటక రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజుతో కలిసి హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరనున్నారు. ఏరియల్ వ్యూ ద్వారా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించనున్నారు. ఆ తర్వాత నారాయణపేట జిల్లా మక్తల్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బీమా?1 లిఫ్ట్‌ను సందర్శించి.. అక్కడ నిర్మించే రోడ్ కం బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని కర్ణాటక మంత్రి బోసురాజుతో కలిసి పరిశీలించనున్నారు. ఆ తర్వాత సీఎం హెలీకాప్టర్‌లో గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్ట్‌కు చేరుకోనున్నారు. పరిశీలన అనంతరం హెలీకాప్టర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్‌కు రానున్నారు. పాలమూరు ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్యాకేజీ-2 (నారాపూర్ రిజర్వాయర్), ప్యాకేజీ-3 (కెనాల్ ) పనులను పరిశీలించనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌కు చేరుకుని.. ఉమ్మడి జిల్లా అధికారులతో ఆయా ప్రాజెక్ట్‌ల పెండింగ్ పనులపై సమీక్షించనున్నారు. 2వ రోజు ఇలా.. రెండో రోజు శుక్రవారం సోమశిల నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి పీఆర్ఎల్ఐ ప్యాకేజీ-1, ఎల్లూరులోని ఎంజీకేఎల్ఐ లిఫ్ట్‌-ను సందర్శించనున్నారు. అనంతరం నార్లాపూ ర్ నుంచి హెలీకాప్టర్‌లో ఉయ్యాలవాడకు చేరుకోనున్నారు. ఇరిగేషన్ కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బిజినేపల్లి మండలం కుమ్మెరకు చేరుకుని పీఆర్ఎల్ఐ ప్యాకేజీ-8, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించి ప్యాకేజీ 9, 10, 11, స్టేజీ-3 పంప్‌హౌస్‌కు సంబంధించి ప్యాకేజీ-8 పనులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కర్వెన రిజర్వాయర్‌కు చేరుకుని ప్యాకేజీ 14, 15 పనులను పరిశీలించనున్నారు. అనంతరం జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌కు చేరుకుని ప్యాకేజీ 17, 18లో కొనసాగుతున్న పనులపై ఆరా తీయనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడి తిరిగి హెలీకాప్టర్ హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

దేశ రాజధాని ఢిల్లీలోని హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం..

## 21 మంది మృతి



న్యూఢిల్లీ, జూన్ 3:దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.

మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మం దికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరి లో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమా దం జరగడానికి గల కారణాలు తెలియ రావాల్సి ఉంది.

### అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 3:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈరోజు(బుధవారం) సీఎం రేవంత్‌రెడ్డిని.. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ బృందం ఎంసీహెచ్‌ఆర్డీలో కలిశారు. అధికారిక పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికా బృందం హైదరాబాద్ వచ్చింది. ఈ సమావేశంలో పెట్టుబడులపై సీఎంతో.. పాలస్ మషటైల్ బృందం చర్చించింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామోదర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సమాచార సాంకేతికత, తయారీ, మౌలిక సదుపాయాలు, ఫార్మా, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు.

దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ కూడా తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం కొనసాగించేందుకు ఇరు పక్షాలు సానుకూలంగా స్పందించాయి.

## భూమి సమస్యతో సెక్రటేరియట్ వద్ద దంపతుల ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, జూన్ 3:తెలంగాణ సెక్రటేరియట్ వద్ద ఈరోజు (బుధవారం) ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ భూమి సమస్యకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన ఓ దంపతులు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తమ వినతిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో దంపతులు పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దంపతుల చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను లాక్కొని వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తర్వాత దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తర లించారు. వారి భూమి సమస్యకు సంబం ధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం



బెంగళూరు, జూన్ 3: కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో బుధవారం మధ్యాహ్నం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల పూర్తి సీఎం రేవంత్‌తోనే సాధ్యం

### -రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





మహబూబ్‌నగర్, జూన్ 3:పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు సహా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో పూర్తిచేసే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. జిల్లా డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదని విమర్శించారు. పాలమూరు ఎంపీగా గెలిచి, ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ప్రాజెక్టు పూర్తిచేస్తానని హామీలు ఇచ్చి ఆర్భాటాలకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. లక్ష కోట్ల వ్యయంతో పూర్తయ్యే పాలమూరు ప్రాజెక్టుకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి పూర్తి చేశామంటూ బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేసి 90 టీఎంసీల నికర జలాలను జిల్లాకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, అలంపూర్ తదితర ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి మక్తల్‌లో పర్యటించి జూరాల ప్రాజెక్టును సందర్శిస్తారని, 5న నార్లాపూర్, వట్టెం, కరివెన ప్రాంతాల్లో పర్యటించి ఉదండాపూర్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. సభను విజయవంతం చేయడానికి ప్రజలు భారీగా తరలిరావాలని, పాలమూరు నియోజకవర్గం నుంచి 25 వేల మంది హాజరుకావాలని జూపల్లి పిలుపునిచ్చారు.

## మళ్లీ దద్దరిల్లిన పశ్చిమాసియా.. అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

న్యూ ఢిల్లీ, జూన్ 3: డ్రోన్‌లు, క్షిపణుల దాడులతో పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లింది. ఓవైపు శాంతి కోసం చర్చలు జరుపుతూనే అమెరికా- ఇరాన్ దేశాలు పరస్పర దాడులకు దిగాయి. ఇరాన్.. కువైట్ , బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అంతకు ముందు అమెరికా ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. కువైట్‌లోని అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్‌లోని ఈసా వైమానిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. కువైట్ వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున పెద్దఎత్తున పేలుడు శబ్దాలు వినిపించాయి. దాంతో ఆ దేశ వైమానిక రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఇరాన్ నుంచి దూసుకొచ్చిన క్షిపణులు, డ్రోన్లను తమ డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకుంటున్నాయని కువైట్ ఆర్మీ జనరల్ స్టాఫ్ పేర్కొన్నారు. మరోవైపు బహ్రెయి న్‌లో కూడా సైరన్‌లు మోగాయి. దాంతో సైన్యం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశా లు జారీచేసింది. ఖేష్మ్ ద్వీపంపై దాడికి ప్రతిస్పందనగానే.. తాము అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్‌జీసీ పేర్కొన్నది.

శత్రు దురాక్రమణలకు.. భిన్నమైన, మరింత తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ ప్రజలను, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు శత్రువుల స్థావరాలను, ప్రయోజనాలను బూడిద చేసేందుకు సైతం తాము వెనుకాడబోమని పేర్కొన్నది. ఇక బెహ్రాయిన్‌లోని యూఎస్ నేవీ ఐదో ఫ్లీన్ ప్రధాన కార్యాలయంపైనా, ఆ ప్రాంతంలోని మరో అమెరికా వైమానిక స్థావరంపైనా క్షిపణులు, డ్రోన్‌లతో విజయవంతంగా దాడి చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

అయితే అమెరికా సెంటకామ్ ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఐఆర్‌జీసీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని తెలిపింది. అమెరికన్ బలగాలపై ఇరాన్ జరిపిన దాడులన్నీ విఫలమయ్యాయని పేర్కొన్నది. దాని దురాక్రమణలను తిప్పికొట్టేందుకు తమ బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది.







## హైదరాబాద్‌లో నకిలీ ఐఏఎస్ ముఠా అరెస్ట్

హైదరాబాద్, జూన్ 3: హైదరాబాద్‌లో నకిలీ ఐఏఎస్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కానిస్టేబుల్ ద్వారా 6 మంది టీంతో ముఠా ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఐఏఎస్ అధికారులమంటూ పూర్ణచంద్రరావు అనే వ్యక్తిని ఈ ముఠా బెదిరించింది. ఫేక్ పోలీస్ కార్‌లో పూర్ణచంద్రరావును సూర్యాపేటకు తీసుకెళ్లి దాదాపు రూ.6.26 లక్షల నగదును వసూలు చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు.ప్రధాన నిందితుడు నాగరాజ్‌తో పాటు మరో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడు నాగరాజుపై రెండు పీడీయాక్ట్‌లు, 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి రెండు గన్స్, ల్యాప్‌టాప్‌లు, రబ్బర్ స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### చర్లపల్లి-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జూన్ 3:భక్తుల సౌకర్యార్థం చర్లపల్లి-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. 07001 నంబర్ చర్లపల్లి-తిరువణ్ణామలై ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు.. ఈ నెల 4 నుంచి సెప్టెంబరు 24వ తేదీ వరకు (గురువారం) చర్లపల్లిలో సాయంత్రం 5.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. అదేవిధంగా మరో మార్గంలో 07002 నంబర్ తిరువణ్ణామలై-చర్లపల్లి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు.. ఈ నెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు (శుక్రవారం) తిరువణ్ణామలైలో రాత్రి 11.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

**చురక**

పుష్కరంగా తెలంగాణ
ప్రగతి లేని ఫలితమా
పదేళ్లు తమది కూడా
పరిపాలన మిలితమా.
రాష్ట్రమేలినోళ్లు అంతా
రాజకీయ ముష్కరులా
ఐతే దాంట్లో గత పాలక
అమాత్యులు తస్కరులా



-వేల్పుల నారాయణ
9440433475

వరకవికి తేజస్సు
భాషకే రోచిస్సు
అవుతుంది ఛందస్సు
అనును రాధశ్రీ !!
ఏకధాటిగ రూలు
చేసి జవహరులాలు
చేసె జనులకు మేలు
అనును రాధశ్రీ !!

**సప్త పదులు** ప్రక్రియా సృజనకర్త: సుధామ

మరువము
పరువము

మనము
ఎప్పుడూ
వాటిని ఇష్టపడి
విడువము.

-రామాయణం దుర్గా ప్రసాద్.

ఏలికలు
పోలికలు

పని
చేయకపోయినా
కావాలి
కీర్తి మాలికలు.

-పంతులలలిత విశాఖపట్నం..

ఉదయించాలి
కదిలించాలి

కొత్త
రుచులు
పాత రుచులను
మరిపించాలి.

-రాజప్ప రాజమహేంద్రవరం


# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 4-6-2026


**సప్త పదులు** ప్రక్రియా సృజనకర్త: సుధామ

కదలకు
మెదలకు

పరిస్థితులకు
జడిసి
నీవైన
బాధ్యతలను వదలకు

-పాటిబండ్ల కవిత విజయవాడ

నోట్లు
కోట్లు

అవినీతి
పంకంలో
మురిగి పోతున్న
కోటానుకోట్లు..

-పద్మావతి పి. హైదరాబాద్

దోషం
ద్వేషం

కొందరు
అన్నిటికీ
అతీతులైనట్లు
వేస్తారు
వేషం

-తిరుమల ఆముక్తమాల్యద



## ఆరాటం

బీదరాలు
తన ఒంటిమీదనున్న
చిరిగిన వస్త్రములలోకి
పరుల చూపు పడకుండా
చేతులడ్డం పెట్టుకొని
మానాన్ని కాపాడుకోవడానికి
ఆరాటపడుతోంది.
ధనికురాలు
ఒంటికి సరిపోని
దుస్తులు ధరించి
అర్ధనగ్నంగా ఉండి
తన అంగాంగాలను
పరులకు ప్రదర్శించడానికి
తెగ ఆరాటపడుతోంది



-ఎ.గజేందర్ రెడ్డి
9848894086

## కవి కాలమ్

ఎందుకయ్యా బాబూ
ఇన్ని రకాల రంగులు
అవసరమా ఈ డాబూ
పనికిరాని హంగులు..!

పనితనంలోనే వుంటుంది
ఓ నాయకా..నీ గెలుపు
పక్క రాష్ట్రం వైపు చూడు
జన నాయకన్
గెలుపే ఓ మలుపు...!!



-డా॥కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

# శ్రీకాంత్ "కవితాశ్వమేధం!"

సమాజ చీకట్లను చీల్చడానికి కవిత్వాన్ని అశ్వంలా పరుగులు పెట్టించాలన్న ఆకాంక్షతో యువకవి బెట్టబోయిన శ్రీకాంత్ "కవితాశ్వమేధం" పేరుతో ఓ కవితా సంపుటిని వెలువరించారు. వృత్తిరీత్యా సీనియర్ ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన కవిత్వ సృజనను ప్రవృత్తిగా మలుచుకుని సాహితీ క్షేత్రాన కవిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం. జాతీయ వాదం, ధర్మ పరిరక్షణ అంటే మక్కువ చూపే శ్రీకాంత్, తెలుగు భాషకు పట్టం కట్టాలన్న గట్టి ఆలోచనతో ముందుకు సాగడం ముదావహం! సామాజిక చైతన్యవే ధ్యేయంగా.. తన అంతరంగంలో సవ్వడి చేసే భావాలను.. మనో నేత్రంపై నాట్యం చేసే ఆలోచనలను కవిగా అక్షరాకృతి నిచ్చేందుకు కృషి చేయడం అభినందనీయం. 'కవితాశ్వమేధం' శీర్షికతో రాసిన ఇందలి మొదటి కవితలోనే శ్రీకాంత్ తన కవితాయానానికి లక్ష్యాలను నిర్ధారించు కుని.. వాటి సాధనకై అడుగులు వేయడం విశేషం! సమాజంలోని అజ్ఞాన చీకట్లను చీల్చడమే ధ్యేయంగా.. బాల కార్మికుల నిర్మూ లనకు, రాజకీయ మురికిని శుద్ధి చేయడానికి, అనాథలను అక్కున చేర్చుకో వాలన్న ఆకాంక్షతో.. మత సామరస్యానికి దోహదపడాలన్న సంకల్పంతో.. మద్యం రక్కసిపై యుద్ధం ప్రకటించేందుకు.. పేదరికాన్ని రూ పుమాపుటకు కుల రక్కసి రెక్కలు విరిచేందుకు.. వరకట్నపు వేధింపుల నివారణకు.. ఇలా స్పష్టమైన ఆలోచనలతో కవి శ్రీకాంత్ తమ కవిత్వాన్ని తీర్చి దిద్దడానికి బయలు దేరారు. నాన్నను "త్యాగ మూర్తి"గా ఆవిష్కరిస్తూ రాసిన కవితలో కవి శ్రీకాంత్ తీగనైతే నిలబడుటకు నాన్న పందిరి గుంజవుతాడనీ.. తేనె కన్న తీయని ప్రేమను పంచుతాడని.. నాన్నను ఉన్నతంగా చిత్రించారు.

సైనికులను "కాపాడే కంటి రెప్పలు"గా అభివర్ణిస్తూ రాసిన కవితలో.. కంటిపైన కునుకులేక, ఒంటిపైన మమత లేక, శత్రు వంటే భయం లేక, ప్రాణమంటే ప్రీతి లేక, కణకణమును భారత మాత నుదిటిపైన కుంకుమగా.. తన తనువును అర్పించే సైనికుల కు అక్షర వందనం సమర్పించారు.

రైతన్నల వెతలకు అద్దం పడుతూ.. "నడువలేనినాగలి" కవితను తీర్చిదిద్దారు. పద్యాల రూపం వోలే కవితా పంక్తులకు జీవం పోస్తూ రాసిన ఈ కవితలో అన్నదాత యొక్క అవస్థలను






ప్రతులకు:
ఇ.నెం.3-48
సంగమేశ్వర్ , గ్రా॥ దోమకొండ, మం॥ కామారెడ్డి,
జి॥, తెలంగాణ-503123
సెల్: 9666244668

ఏకరువు పెట్టారు.

ఆకలి అంటే ఏమిటో.. నూకలి గింజనడుగుతా! గూడు అంటే ఏమిటో.. గుడిసెలో వున్న అవ్వనడుగుతా...! తోడు అంటే ఏమిటో.. నా మనసులోని మనిషిని అడుగుతా! శాపం అంటే ఏమిటో.. నా మదిటనున్న రాతన డు గుతా! అంటూ "పేదోడి ప్రశ్న" కవితలో.. పేదోడి పక్షాన నిలిచి ప్రశ్నల వర్షం కురిపించారు.

"తెనుగోని గోస" కవితలో కవి శ్రీకాంత్ తెనుగోళ్ల కష్టాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

**శిప్పల పండ్ల తట్టలతో**
**శెరువుల కొర్రమొట్టలతో**
**పోతురాజు గావులతో**
**పెద్దమ్మ బోనాలతో**
**బతుకులెల్లదీసేటి..**
**భారమైన మనుషులం**

అంటూ మెతుకుల వేటలో పడిన ముదిరాజు బిడ్డల బాధలను వివరించారు.

రాజకీయ నాయకులకు.. ఓటు బ్యాంకు మూటలం! పదవులల్ల ఉన్నవాడికి పాలరాతి కోటలం అంటూ వ్యాఖ్యానించారు.

"అమ్మకి ఆసరా" కవితలో అమ్మకి ప్రేమ ను పంచనప్పుడూ, దిక్కుమాలిన దినములు ఎందుకు? అంటూ ప్రశ్నించారు. అమ్మ బతికి వున్నప్పుడు పట్టించుకోక.. పోయాక.. ఆర్భాటంగా చేసే పనులెందుకు, అన్న అర్థం ధ్వనించే విధంగా బతికి వున్న ప్పుడే అమ్మ పట్ల కాస్తంత దృష్టి పెట్టాలని హితవుపలికారు. **'మదర్స్ డే'** లాంటివి పెట్టి ఒక్క రోజే అమ్మను గౌరవించవద్దని సూచించారు. నిత్యం పూజించా లని ఆకాంక్షించారు.

**'నవయుగనారి"** శీర్షికతో రాసిన పద్యాలలో మహిళలే భారతి భవితకు వారధులని తేల్చి చెప్పారు. ఆడవారిలో స్వాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని నింపేలా తమ భావ ప్రకటన చేయడంలో కవి సఫలీకృతులైనారు.

**"ఆగమవుతున్న తెలుగు భాష"** కవితలో తెలుగు భాషను కాపాడుకోవాలన్న ఆకాంక్షను వెల్లడించారు. "ఆత్మ నివేదనం" కవితలో కవి శ్రీకాంత్ యొక్క తాత్త్వికతను చూస్తాం-

'రాలుతున్న ఆకు' లాగ మారబోకురా! రగులుతున్న అగ్ని లాగ రణము చేయరా అంటూ పిలుపునిస్తూ రాసిన కవితలో కవి యొక్క అభ్యుదయ భావాలను వీక్షించగలం.

**"మహాభారతం"** కవితలో.. మహాభారతం..మానవ మనోవికాసం.. మహోన్నత ధర్మ సంస్థాపనం.. మధుర గీతా మృత జ్ఞాన విస్ఫోటనం అంటూ నాలుగు మంచి మాటలకు చోటు కల్పించారు.

తను వేరు, నేను వేరు తారతమ్యము లేని, భార్యాభర్తల బంగారు బంధమే దాంపత్య మంటూ.. **"మధురానురగాల మాంగల్య బంధం"** కవితను తీర్చిదిద్దారు. ఇలా ఎన్నో కవితా పంక్తులు ఉదహరించడానికి యోగ్యంగా వున్నాయి. కవి వస్తు ఎంపికలో శ్రద్ధ చూపినప్పటికీ.. అభివ్యక్తిలో యింకా కృషి చేయాల్సి ఉంది. సీదా సాదాగా కాకుండా.. కవితాత్మకంగా భావ ప్రకటన చేయాల్సి ఉంది. శిల్పం వంటి అంశాలపై దృష్టి సారించవలసి ఉంది. కవిత్వంలో వచనం డామినేట్ చేయకుండా జాగ్రత్త పడాలి. సమాజంలోని రుగ్మతలను నివారించి సామాజిక చైతన్యానికి దోహదపడేలా కవిగా తమ కవితా వస్తువులను ఎంపిక చేసుకోవాలి. తమ కవిత్వంలో సమాజాన్ని మరింత బలంగా ప్రతిఫలింపజేయాలి- అధ్యయనంపై దృష్టి సారించి కవిత్వ సృజనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని తమ కలానికి పదును పెట్టుకుంటారని విశ్వసిద్దాం. ఆ దిశలో కవి శ్రీకాంత్ అడుగులు వేస్తారని ఆశిద్దాం.



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## నేను...నేనే..

భయ్యా?...ప్రేమగాపిలిచాడు
మొహం చాటేసాను
నామతం కాదు...

బ్రదర్...ఆప్యాయత ఉన్నా
తప్పుకున్నాను..
నామతం కాదు.

అన్నా..నోరారాపిలిచినా
నాయింగితం ఒప్పుకోదు
నాకులపోడు కాదు.

నేడు....
నేను...నేనే..ఒంటరిని...
దశాబ్దం క్రితం భారతీయుణ్ణి
ఈనాడు.....
కాలంచేత ఉరి తియ్యబడ్డ
దిక్కులేని పక్షిని....



-చకోనా
9885797375

## నానీలు

పుట్టుకే జననం
అంటే ఎట్లా..!
కొందరి మనసుల్లోనైనా
నీవు పుట్టాలిగా...!

ధరలు
కళ్లెం విడిచిన గుర్రాలైనాయి
బీద రౌతు
ఎన్ని పాట్లు పడాలో...!

గొంతుక తడుపుతూ
నది
దాని గొంతుక కోసే
ప్రయత్నం మనిషిది.



- అవ్వారు శ్రీధర్ బాబు
సెల్:8500130770

పుస్తక సమీక్షలు

# గుండె కావాలి... గుండె సవ్వడీ కావాలి"

ఇద్దరు చిన్నారుల కన్నీళ్లనుండి ఒక కోర్టుహాలులో పుట్టిన ఆర్తనాదమది. పేగుల్లో ఆకలికి బదులు, అమ్మా, నాన్న... ఇద్దరూ కావాలన్న ఆశ, గొంతెత్తి నరాలు తెగిపోయేలా అరుస్తున్న సందర్భమిది. తల్లడిల్లి పోతున్న బాల్యం నిరాశ సమాధుల దగ్గర నిలబడి తమకు న్యాయం చేయండంటూ న్యాయస్థానం ముందు చేతులు జోడించి ప్రార్థిస్తున్న సన్నివేశమది. ఆ పిల్లల కన్నీళ్లకు తాను కదలటం మరచిపోయిన కాలం, ఉలిక్కిపడుతున్న గాలిని కౌగిలించుకుని భోరుమని రోదిస్తున్న చిత్రపటానికి రంగులను వెతుక్కుంటున్న వెతల సమూహిక గానమిది. ఎక్కడో తీగలు తెగిన వీణ, ఆ పిల్లల వేదన చూడలేక వాళ్లకోసం ఓ ఓదార్పు గీతం వినిపించాలని సప్తస్వ రాలను తీగల్లా మార్చుకుంటున్న ప్రయత్నంలో అప్రయ త్నంగా పలికిన త్యాగరాజు కీర్తన ఇది. మండుటెండలో ఎడారి ఇసుక రేణువుల మీద పరిగెత్తలేక ఆయాసపడుతున్న పిల్లల ఊపిరితిత్తుల్లోకి మీకు నేనున్నానంటూ ఈ ప్రపం చంలో ఓ కలం తన కౌగిట్లోకి ఆ చిన్నారి శ్వాసలకు ఆశ్ర యం కల్పించిన కలకాని ఓ వాస్తవ ఈ దృశ్యమిది. జస్టిస్ బి. చంద్రకుమార్ కలం నుండి వెలువడిన **'అమ్మ కావాలి – నాన్న కావాలి'** నవలికలోని చిన్నారులు నవ్య, రవిల గుండె కోతల శబ్దాన్ని వినిపిస్తున్న సాహిత్య రంగుల చిత్రమిది.

జస్టిస్ బి. చంద్రకుమార్, తనజీవితంలో న్యాయానికి ప్రతీకగా నిలబడిన ఓ ఉన్నతస్థాయి ఆదర్శ న్యాయమూర్తి మాత్రమే కాదు. ప్రపంచాన్ని, అందులోని జనం జీవితాల వివిధ సమస్యలలోకి తనదైన కోణంనుంచి పరిశీలించి, పరిశోధించి, ఆ సారాలను సాహిత్యపరమైన రూపాలలోకి సారవంతంగా తర్జుమా చేయగల శక్తిని సహజంగా తన తోడు తెచ్చుకున్న సాహితీవేత్త ఆయన. న్యాయమూర్తిగా తన పర్యవేక్షణలో అసంఖ్యాకమైన కేసులను ఆయన వినటమే కాదు, వాటి లోతుల్లోకి తన దృష్టిని సారించి, లోకహితం కోసం అక్షరాల వలయాలలోకి వాటిని బంధించి పుస్తకాలుగా వెలివరించిన నేపథ్యం నుంచి సృజన కాబడిన మరో ఆలోచనాత్మక అపురూప దృశ్యరూపమే 'అమ్మ కావాలి నాన్న కావాలి' నవలిక. ఈ రచన ఊహాచిత్రం కాదు. వాస్తవ జీవితాలనుండి పురుడుపోసుకున్న ఎన్నో సత్యాల ప్రాణవాయువు ఇది. దంపతులుగా జీవించలేని ఓ ఇద్దరి మధ్య అగాధంలా పేరుకుపోయిన విజ్ఞతలేని మూర్ఖత్వ వికృతరూపానికి విరుడుగా రచయిత చంద్రకుమార్ ఎంతో నేర్పుతో అందించిన ఓ అద్భుతమైన ఔషధాల చికిత్సల రూపం ఈ నవలిక.

సుశ్మిత, రత్నకుమార్‌లు భార్యాభర్తలు. అంతేకాదు నవ్య, రవి అనే ఇద్దరు పిల్లలకు తల్లిదండ్రులు కూడా. పెళ్లికి ముందున్న ప్రేమలు, పెళ్లి తరువాత ఎందుకు క్రమంగా అదృశ్యం వైపుకు అవి వెళ్లిపోతాయో ఇప్పటికీ అర్థంకాని విషయంగా ప్రపంచాన్ని ఏలుతూనే వుంది. సంసారం మొదలయ్యాక భార్యాభర్తల మధ్య ఊహించని చాలా సమస్యలు ఎదురవుతాయి. వ్యక్తిగత ఆలోచనలు, అభిరుచులు, కోరికలు, పంతాలు, పట్టింపులు భార్యాభర్తల్లో కొత్త వికార గుడారాలకు నిర్మాణాలు మొదలవుతాయి. అదే జరిగింది సుస్మిత, రత్నకుమార్ జీవితాల్లో కూడా. అవగాహనతో చేసుకునే సర్దుబాట్ల సంతకాలు పూర్తిగా చెదిరి, మంచులా కరిగిపోయి, గాలిలో ధూళికణాల్లా కలిసిపోయాక, కోపాలు, తాపాలు, ఆక్రోశాలు ఒకరిమీద ఒకరు దండయాత్ర చేసుకోవటానికి పదునుపెట్టిన ఆయుధాల్లా అవి మారిపోతూ వుంటాయి. ఆ యుద్ధాల ఫలితమే విడాకుల దాకా పై ఇద్దరి దంపతులను నడిపించింది. కలిసివుండాలనే ఆలోచన నుంచి విడిపోయి బ్రతకాలన్న గట్టి నిర్ణయానికి జీవితాలు తీర్మానించుకున్నాక ఇద్దరి మధ్య వివాహమనే బంధం, నడిచే కాలం వురిత్రాడు ముందు దోషిగా నిలబడుతోంది. జరుగుతున్న యుద్ధంలో ఎవరికివారు తమ విజయాల పతాకాలను ఎగురువేయటానికి సిద్ధపడుతున్నారే తప్ప, భార్యాభర్తల యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఎప్పటికీ వుండరని, ఇద్దరికీ ఓటమి తప్ప విజయాలు ఎవరి ఖాతాల్లో రచించబడవని, విడిపోయాక శూన్యానికి మాత్రమే అంకితమయ్యే సన్నివేశాలు తోడుగా నడుస్తాయని, నిస్సారమైన జీవిత అధ్యాయాలలో ఎడారి ఎండమావుల్లా శ్వాసలు మారిపోతాయని తెలుసుకోలేక విడాకుల కోసం వర్తమానంలో చాలా మంది దంపతులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయం అందరికీ చేరేలా, చేరి అర్థమయ్యేలా ఈ నవలికలో రచయిత చేసిన సాధన, ఎన్నో ప్రయోజనాల ఫలితాలవైపుకు తన దస్తావేదుల్ని సిద్ధం చేసుకుంటోంది.

అవివేకం, అనాలోచిత నిర్ణయాలు, ఆసంకల్పిత భేషజాలు, అర్థాల అవయవాలు కోల్పోయిన విజ్ఞత... ఇవన్నీ దంపతులు విడిపోవటానికి వెనకనున్న ఒక సైన్యంలా కవాతు చేస్తూవుంటాయి. ఈ భయంకర దృశ్యాలనుంచి బయటపడలేని భార్యాభర్తలు తమకు పుట్టిన పిల్లల మనోవేదనను, మానసిక సంఘర్షణను, ఆ చిన్నారి కోరికల తలపాగాల కొలతలను సకాలంలో అంచనా వేయలేక రేపటి పిల్లల భవిష్యత్తులను శోకసముద్రాల అలలమీదికి కర్కషంగా విసిరేస్తున్నారు. యుద్ధాలను చరిత్రలోనే కాదు రోజూ ఇంట్లో అమ్మా నాన్నల మధ్య సైతం చూస్తూ అల్లాడిపోతున్న పిల్లల గుండెసవ్వడిని ఒక్కసారి వింటే, అందులోని దృశ్యాలు కఠిన శిలలచేత సైతం కన్నీళ్లను కార్పిస్తాయి. రోజూ ఇంట్లో అమ్మానాన్నలు కోపతాపాలతో విసురుకుంటున్న మాటలన్నీ, పిల్లల దుఃఖం తలుపుల దగ్గర శవాల గుట్టలై రాలుతూ వుంటాయి. దంపతులిద్దరూ కోప తాపాలతో కలబడిన ప్రతిసారి ఆ బీభత్స దృశ్యాలు భయపెట్టే శ్మశానంలోని పుర్రెలై పిల్లల మెడల్లో వ్రేలాడుతూ వుంటాయి. అమ్మానాన్నల ఆలనాపాలనలేని చీకటి బ్రతుకుల్లో పిల్లల బాల్యం తలతెగిన శవంలా మారిపోతూ వుంటుంది. అమ్మ ప్రేమకోసం, నాన్న భుజాలమీద ఊరేగే క్షణాలకోసం ఆ పిల్లలు శోకవనాలలో ఎన్ని రోజులుగా తపస్సులు చేస్తున్నారో అలసిపోతున్న వాళ్ల కనురెప్పలకు మాత్రమే తెలుస్తూవుంటుంది.

ఇదే అనుభవాలతో, ఇదే పరిస్థితుల్లో కన్నీళ్లను కార్చుతున్న పిల్లలు నవ్య, రవిలు తమ అమ్మానాన్నలు విడాకులు కోరుతున్న కోర్టులో గొంతెత్తి తమ వేదనను గట్టిగా ఈ నవలికలో వినిపిస్తారు . పిల్లలు ఎవరి దగ్గర వుండాలన్న వాదనలో, 'మాకు అమ్మానాన్న ఇద్దరూ కావాలి. ఇద్దరూ మాదగ్గర వుండాలి. భార్యాభర్తలకు విడాకులు మంజూరు చేయటానికి న్యాయసూత్రాలు ఉన్నప్పుడు, పిల్లలు వాళ్ల






అమ్మానాన్నల దగ్గర కలిసి వుండాలని చెప్పటానికి న్యాయం దగ్గర ఎందుకు సూత్రాలు లేవని చిన్నారులు వేసిన ప్రశ్నలు మేధావులను సైతం ఆలోచింపజేస్తున్నాయి. **'అమ్మానాన్నల తరపున వాదించటానికి అటూ ఇటూ న్యాయవాదులున్నట్లే, పిల్లలమైన మా నుంచి కూడా వాదించటానికి న్యాయవాదులు ఎందుకు లేరు...'** అన్న పిల్లల ప్రశ్నలకు జవాబుగా నిలిచే మాటలకోసం కాలం సైతం ఎదురుచూస్తున్న సన్నివేశాన్ని అత్యంత శక్తివంతంగా, ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా ఈ నవలికలో ఆందించారు రచయిత చంద్రకుమార్. విడాకుల కేసులో వాదనలు జరుగుతున్నప్పుడు, జడ్జిగారు **'పిల్లల్ని కూడా పార్టీలుగా చేర్చండి...'** అంటూ ఆదేశించినప్పుడు సుశ్మిత లాయరు అందుకు చట్టం ఒప్పుకోదని అడ్డుచెప్పినప్పుడు **'నాకున్న విచక్షణాధికారాన్ని ఉపయోగించి వారు ఇక్కడ అవసరమైన పార్టీలుగా ఇంప్లీడ్ చేస్తాను...'** అంటూ జడ్జి పలికిన మాటల్లో రచయిత చంద్రకుమార్ మనసు, ఆలోచన, ఆయన విశాల భావాలు, సున్నితమైన హృదయ స్పందన చాలా స్పష్టంగా, చాలా ఉన్నతంగా పాఠకుల్ని నేరుగా చేరుతున్నాయి.

సుశ్మిత, రత్నకుమార్ దంపతుల విడాకుల కోసం, పిల్లలు ఎవరి దగ్గర వుండాలన్న వాదనలు జరుగుతూ, కేసు వాయిదాలు పడుతున్న క్రమంలో పాప నవ్య నాన్న చేయి విడిపించుకొని అమ్మకోసం ఏడుస్తూ రోడ్డును దాటేక్రమంలో పాపకు ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరవలసి వస్తుంది. ఈ సన్నివేశం కథలో గొప్ప మలుపుకు ప్రధాన కారణంగా నిలిచి తరువాత కథాగమనానికి తగిన రహదారులు నిర్మించే బాధ్యతను రచయిత చాలా నేర్పుగా సన్నివేశాలను అల్లడం పాఠకులను అబ్బురపరుస్తుంది. రచయిత కథను నడిపించటమే కాదు, పాఠకుల్ని సైతం చివరిదాకా తనతో కథ రహదారులగుండా నడిపించగల సత్తాను ఈ నవలికలో ప్రదర్శించడం ఆ కలానికున్న బలాన్ని తెలియజేస్తూ వుంది. ఇప్పుడు సుశ్మిత, రత్నకుమార్ ల ఆలోచనలు పూర్తిగా పాపకు జరిగిన ప్రమాదం మీద, ఆ ప్రమాదం నుంచి పాపను బ్రతికించుకోవాలనుకునే ఆశల మీద మాత్రమే కేంద్రీకరించబడటం జరుగుతుంది. ఆసుపత్రిలో పాపను చూస్తూ దంపతులిద్దరూ కార్చిన కన్నీరు ఒకేరకంగా, ఒకే వేదనతో, ఒకే బాధతో వుండటం అది మానవసంబంధాల నిర్వచనాలకు తిరుగులేని సూత్రంగా నిలిచిపోతోంది.

ఈ క్రమంలో ఇద్దరికి ఉద్యోగాలు పోతాయి. ఆర్థిక సమస్యలు ఎదురవుతాయి. తాము కోరితెచ్చుకున్న పరిస్థితులు పాముల్లా మారి ఎంత భయంకరంగా కాటేస్తున్నాయో అనుభవాల ద్వారా గమనించిన ఆ దంపతుల మనసు పొరల్లో దట్టంగా పొగచూరిన ఆకాశం మెల్లమెల్లగా నిర్మలంగా మారటానికి సిద్ధపడింది. దూరంగా వేరువేరుగా నివసించటానికి సిద్ధపడి విడిపోయిన జంట ఇప్పుడు ఒకే చోట ఉండటానికి పరిస్థితులు ఆదేశించాయి. కోపతాపాల మలినాలు తొలిగి కడిగిన ముత్యంలా తయారయిన మనసుల తూర్పుకొండలనుండి క్రొత్త సూర్యుడు ఉదయించటం మొదలుపెట్టాడు. అమ్మానాన్నలను ఒకచోట జంటగా చూస్తున్న పిల్లల కళ్లనిండా కోటి వెలుగులు పోటీపడి ఆనందాన్ని ఇవ్వటానికి పరుగుపందాలు మొదలు పెడుతున్నాయి. ఇప్పుడు దంపతులుద్దరి మధ్య మునుపటి ఇనుపగోడలు పటాపంచలైపోయి, మందార పూలతో మనసులు ఆలింగనానికి సిద్ధపడుతున్నాయి. వర్షాకాలం కాకపోయినా అవగాహన మేఘాలన్నీ గుంపులు గుంపులుగా దంపతుల సమిపానికి వచ్చి అనురాగాన్ని ఆనందంగా కుంభవృష్టిలా కురిపించటానికి అనుమతి పత్రాలను ఆ దంపతులకు సమర్పించుకుంటున్నాయి. చివరకు కథ సుఖాంతమవుతుంది. అందరూ కలిసిపోతారు. 'అమ్మ కావాలి నాన్న కావాలి' అన్న పిల్లల నినాదం తన విజయానికి ఉత్సవాలను సిద్ధం చేసుకోవడం పాఠకుల సంతోషాన్ని రెట్టింపు చేస్తోంది.

నవలా లక్షణాలను సంపూర్ణంగా పాటిస్తూ, సందర్భానుసారంగా నాటకీయత ప్రధాన్యతను సమంగా పోషిస్తూ, పాత్రల స్వభావాలను, వాటి మనస్తత్వాలను, ఆ పాత్రల బలాలను, బలహీనతలను సమస్తాన్ని అతిసహజంగా చిత్రీకరించడంలో రచయిత చంద్రకుమార్ ఒక సాహిత్య శిఖరాగ్రస్థానాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాడన్న వాస్తవాన్ని ఇందులోని ప్రతి అక్షరం గొంతెత్తి గానం చేస్తోంది. ఎన్నో వాదనలు జరిగిన ఈ కేసులో పిల్లల్నే న్యాయమూర్తులుగా చిత్రీకరించిన సన్నివేశాలన్నీ చాలాకాలం పాఠకులకు గుర్తుండిపోతాయి. దాదాపుగా 20 ఏళ్లుగా రచనలు చేస్తున్న చంద్రకుమార్ కలం తన బలప్రదర్శనకు ఈ నవలిక ఒక వేదికగా నిలుస్తోంది. పాఠకులు ఈ నవలిక పఠనంలో ఎటువంటి విరామం కోరని పరిస్థితుల్ని అదృశ్యంగా రచయిత శాసించిన నేర్పు చాలా ఆకట్టుకుంటుంది. సంభాషణలు కలంనుంచి కాకుండా మనసుపొరలనుంచి ఉబికిన చెలిమ నీరులా ఊరుతూ పాఠకులకు ఉత్సాహాన్ని కలిగించడం ఈ నవలిక సాధించిన విజయాలు మనతో కరచాలనం చేస్తున్నా యి. నవలికలో నడుస్తున్న ప్రతి దృశ్యాన్ని మన ఎదుట నిలబెట్టి రంగులతో ఆ దృశ్యాలను ఒక తైలవర్ణపటంలా తీర్చిదిద్దిన చతురత సాహిత్యంలో ఈ నవలికకు తగిన స్థానాన్ని కేటాయిస్తోంది. న్యాయమూర్తిగా తన సుదీర్ఘ అనుభవంతో పిల్లల భవిష్యత్తు మీద విడాకుల ప్రభావం ఎంత భయం కరంగా వుంటుందో తెలియజేసే క్రమంలో వెలువడిన ఈ నవలిక ఎంతోమంది సంసారాల విషయాలలో అవగాహనలేని దంపతులకు ఒక విలువైన పాఠంగా ఈ నవలిక నిలుస్తుంది. పిల్లల మనస్తత్వాన్ని తన హృదయానికి అతిదగ్గరగా చేర్చుకుని, అమ్మానాన్నల కోసం పిల్లలు కార్చిన కన్నీళ్లకు తన నేత్రాలను అరువుగా అందించిన సహృదయుడు ఈ రచయిత. సగటు మనుషుల జీవితాలలో పెనవేసుకుపోయే సమస్యల పరిష్కారానికి ఒక వెలుగుదీపంలా నిలిచిన రచన ఇది. సమాజాన్ని, అందులోని జనాన్ని తనదైన శైలిలో ప్రేమించే ఈ కలం కదిలిన ప్రతి పాదముద్రలనిండా ముద్రించబడిన భావాల సందడి భవిష్యత్తులోని ఒక ఆనందమయమైన సంసార సంతోషాల జీవితాలకు స్వాగతాలు పలుకుతున్నట్లుగా వుంది. సమాజహితాన్ని కోరేది రచన అనే నినాదానికి నిలువెత్తు తిలకంగా నిలిచిన ఈ రచనను అందించిన జస్టిస్ చంద్రకుమార్ ఎంతయినా అభినందనీయుడు.

(ప్రతులకు: జస్టిస్ బి. చంద్రకుమార్
సెల్:8978385151)



సాహిత్య ప్రపూర్ణ
-డాక్టర్ కె. జి. వేణు
98480 70084

> "ఇద్దరు చిన్నారుల కన్నీళ్లనుండి ఒక కోర్టుహాలులో పుట్టిన ఆర్తనాదమది. పేగుల్లో ఆకలికి బదులు, అమ్మా, నాన్న... ఇద్దరూ కావాలన్న ఆశ, గొంతెత్తి నరాలు తెగిపోయేలా అరుస్తున్న సందర్భమిది. తల్లడిల్లిపోతున్న బాల్యం నిరాశ సమాధుల దగ్గర నిలబడి తమకు న్యాయం చేయండంటూ న్యాయస్థానం ముందు చేతులు జోడించి ప్రార్థిస్తున్న సన్నివేశమది"




# అభినవ మొల్ల డా॥బల్లూరి ఉమాదేవి



-డా॥బీరం సుందరరావు
6303443302







"తేనె సోకనోరు తీయన యగురీతి
తోడ నర్థ మెల్ల తోచకుండ
గూఢశబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటి వారి ముచ్చటగును"

అంటూ అలనాటి **"మొల్లమ్మ"** కవిత్వం ఎలా ఉండాలో చెప్పింది. నాలుక మీద తేనె చుక్క పడగానే నోరంతా తీయగా మారి నట్లు చదివిన వెంటనే కవిత్వం అర్థం కావాలి. అలా అర్థం కాని శబ్దాలను ప్రయోగించి రాసిన కావ్యం మూగ చెవిటి వారికి మాత్రమే ముచ్చటగా ఉంటుంది. అంటే కవిత్వం విన్నటానికి ఇంపుగా ఉండాలి, చదవడానికి సొంపుగా ఉండాలి. దీనినే మొల్ల మరో సందర్భంలో..

**"కవిత్వం వీనుల విందుగా, అమృతపు సోనల పొందుగా ఉండాలి"** అంది. ఆరు శతాబ్దాల క్రితం ఆతుకూరి మొల్ల తెలుగు పద్యానికి చెప్పిన అనుభవాత్మక నిర్వచనం నేటికి అక్షరసత్యంగా నిలిచే ఉంది.

కాలానుగుణంగా కవిత్వానికి నిర్వచనాలు మారినా నన్నయ నుండి నేటి వరకు పద్యం పాద నియమం తప్పలేదు. యతి ప్రాసలను వదలలేదు. గణాలను గుణాలుగా స్వీకరించడం మానలేదు. అలంకారాలను విస్మరించలేదు. వెరసి వెయ్యేళ్ల తెలుగు పద్యం వెలుగుపూలు పూస్తూనే ఉంది. ఇంద్రధనుస్సులా విప్పారుతూనే ఉంది.

నాటి మొల్ల లాగా ఛందస్సుందరపద బంధురంగా కవిత్వం రాస్తున్న బల్లూరి ఉమాదేవి గారు నేటి మన "అభినవ మొల్ల"గా అభినందనలు అందుకుంటూ ఉన్నారు.

కవిత్వం గురించి తనకేమీ తెలియదంటూనే, మొల్ల అందరికీ అర్థమయ్యే సులభశైలిలో 'రామాయణం' రాసి ప్రథమ రామాయణ కవయిత్రిగా కీర్తి గడిచింది. ఉమాదేవి గారు పండిత కుటుంబంలో పుట్టి, పద్య సాధన చేసి స్వయంకృషితో కవయిత్రిగా గణుతికెక్కారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఇంటర్మీడియట్ తో చదువుకు స్వస్తి చెప్పిన ఉమాదేవి గారు భర్త శ్రీ కామవరం భీమసేన రావు గారి ప్రోత్సాహంతో డిగ్రీ ప్రైవేటుగా పూర్తి చేసి ఎం.ఏ తెలుగు (కళాశాలలో) చదివి అనంతరం **"తెలుగు కన్నడ సాంప్రదాయ స్త్రీల పాటలు తులనాత్మక పరిశీలన"** అనే అంశంపై పరిశోధన చేసి శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం నుండి తమ 52వ వయస్సులో డాక్టరేట్ సాధించి డాక్టర్ ఉమాదేవి అయ్యారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేసి వేలాది మంది శిష్యులకు ఆరాధ్య గురువయ్యారు. నిరంతర సాధన తో పద్యం మీద పట్టు సాధించారు. ప్రాచీన ఆధునిక కవుల కావ్యాలను ఆకళింపు చేసుకుని పద్య నిర్మాణంలో మెళకువలను తెలుసుకున్నారు. పృచ్ఛకురాలిగా ఎన్నో అవధానాలలో పాల్గొని అలరించారు. సాహిత్య ఉపన్యాసాలతో వేదికలను వెలిగించారు. 8 శతకాలను రచించారు. 300 పాటలు, రెండు వేలకు పైగా కవితలు, 100కు పైగా సాహిత్య వ్యాసాలు రాసి విదుషీమణిగా విఖ్యాతిగాంచారు.

**"పద్యం పాతబడిపోయింది పద్యం పాత చింతకాయ పచ్చడి"** అంటూ పద్యాన్ని పరిహసిస్తున్న వాళ్లకు సమాధానంగా వివిధ అంశాలపై 50 వేల పైచిలుకు పద్యాలను రాసి పద్య కవిత్వానికి పట్టాభిషేకం చేశారు. ఫేస్బుక్, వాట్సాప్, ఇంటర్నెట్ వేదికగా వేలాది మంది పాఠకుల అభిమాన రచయిత్రిగా మన్నన లందుకుంటూ ఉన్నారు.

**"తెలుగు భాషలోని తీయందనము నెల్ల
పూర్వకవులు వ్రాసి పొగిడినారు
వారి బాట నడిచి వాసిగా పేరొంద
కీర్తి కలుగు ప్రజకు స్ఫూర్తి కలుగు."**
(అక్షరవనం -పుట 29)

పూర్వకవుల్లాగే తానూ తెలుగు భాష తియ్యదనాన్ని ఆస్వాదించి, ఆ తీపిని పాఠకుల రుచిచూసేలా రచనలు చేస్తానన్నారు ఉమాదేవి గారు. ప్రముఖ కవుల బాటలో నడిచి స్ఫూర్తిదాయక రచనలు చేసినప్పుడే కవికి సత్కీర్తి, ప్రజలకు స్ఫూర్తి లభిస్తుంద న్నారు. సామాజిక ప్రయోజనం లక్ష్యంగా తమ రచనలు ఉంటాయని ఉమాదేవి గారు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు.

దేశీయ ఛందస్సులైన ఆటవెలది, తేటగీతి, సీసం, కందం వగైరా పద్యాలు మన తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేశాయి. ఆటవెలదిలో ఎన్నో నీతులను, సామాజిక రీతులను, సూక్తులను, మనోహరోక్తులను ప్రజల భాషలో చెప్పిన ప్రజాకవి వేమన, అనంతర కవులకు మార్గదర్శిగా నిలిచారు. ఉమాదేవి గారు తాము రాసిన శ్రీరామదూత శతకము, తెలుగుబిడ్డ శతకము, దేవీ శతకము, కనకదుర్గ శతకము, రామచంద్ర శతకము, శ్రీనివాస శతకము ఆట వెలదులలోనూ, శారదాంబ శతకము తేటగీతిలోనూ, హనుమత్ శతకము కందపద్యాల్లోనూ రచించారు. సందర్భానుసారంగా అభ్యుదయ భావ సుగంధాన్ని వెదజల్లారు.

వేమన చెప్పిన "ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు" - అనే ప్రసిద్ధ పద్యాన్ని ఉమాదేవి గారు

**"ఉప్పులేని కూర ఉర్విలో నుండదు
ఉప్పు ఎక్కువైన ముప్పు కలుగు
అనుట కల్ల కాదు అక్షరాల నిజము
తెలిసి మసలుకొనుము తెలుగు బిడ్డ"**
(తెలుగు బిడ్డ శతకం-పద్యం 40)

దీన్నే కాలస్పృహ అంటారు. కవి కాలానుగుణంగా తన భావజాలాన్ని విస్తరింప చేసుకోవాలి. వేమన ఉప్పు కర్పూరం ఒకటిగానే ఉన్నా రుచుల్లో తేడా ఉంటుందని లోకంలోని మనుషుల మనస్తత్వాలను చిత్రించారు. ఉమాదేవి గారు ఉప్పు లేకుండా కూర రుచిగా ఉండదని, అలాగని రుచి కోసం మోతాదును మించి ఉప్పు వాడితే ఆరోగ్యానికి ముప్పు తప్పదని హెచ్చరిస్తూ సమకాలీన సమాజానికి చక్కని ఆరోగ్య సూత్రాన్ని అందించారు. వేమన చెప్పింది సార్వకాలిక సత్యమైతే, మేడం గారు రాసింది సమకాలీన సత్యం. ఉమాదేవి గారు తమ లోకానుభవాన్ని కమనీయ భావాలతో రమణీయంగా చెప్పి శతకంలోని ప్రతి పద్యాన్ని బంగారు పతకంగా మార్చారు.

తెలుగులో శతకాలు కేవలం భక్తికో, ముక్తికో, పరిమితం కాలేదు. నాటి పాల్కురికి సోమన నుండి నేటి ఉమాదేవిగారి వరకు తెలుగులో సంఘభక్తి శతకాలు, దేశ భక్తి శతకాలు, మాతృభక్తి శతకాలు, సామా జిక శతకాలు వందలాదిగా వెలువడ్డాయి.

**"కరుణచూపు మమ్మ కనకదుర్గ"** మకుటంతో ఉమాదేవి గారు రాసిన కనక దుర్గ శతకంలో చక్కని సామాజిక స్పృహ రాసిన పద్యాలు హృద్యంగా ఉన్నాయి.

**"జనుల బాధలణచి జగతికి మేలును
కలుగ జేసి నట్టి కాళికాంబ
దుర్గుణములు బాపి తోషమునొసగుచు
కరుణచూపుమమ్మ కనకదుర్గ"**
(పద్యం 32)

లోకంలో, స్వార్థభక్తి తాను బాగుంటే చాలు అంటుంది. సామాజికభక్తి అందరూ బాగుండాలి అంటుంది. సమాజం సుఖశాంతులతో ఉండాలని జగతికి, జనులకు మేలు జరగాలని కనకదుర్గమ్మను కోరుకో వడం మేడం గారి సామాజిక చింతనకు నిదర్శనం.

మరోపద్యంలో ?



**"కలియుగమ్మునందు ఖలుల సంఖ్య పెరిగె
భద్రతయును తగ్గె బాలికలకు
భద్రమొసగి వారి భయములు మాన్పుము"** (పద్యం 91)

కళాశాల లెక్చరర్ గా తాను నిత్యం చూసే సంఘటనలకు కవితా రూపం ఇచ్చారు మేడం గారు. ఉమాదేవి గారు ఆట వెలదులను ఎంత అందంగా వ్రాశారో కంద పద్యాలను అంతగా కాంతులీనేలా చేశారు.

మేడం గారి కలంలో సీసం దరహాసం చేసింది. ఉత్సాహం, మత్తకోకిల వంటి ప్రత్యేక చందస్సులను తమ కవన ప్రతిభతో పండించారు. అందుకు వారి "అక్షరవనం" పద్య సంపుటి ఆకరంగా నిలిచింది. 50 ఖండికలు వస్తువైవిధ్యంతో ప్రకాశించాయి.

మాట గొప్పతనాన్ని వివరిస్తూ?

**"విలువ కలిగినట్టి వలువల కన్నను
నాణ్యమైన పసిడి నగల కన్న
మంచి మాట యొకటే మహిలోన గొప్పది
మాన్యతొసగుచుండు మంచి జరుగు"**
(అక్షరవనం- పుట 35)

మనిషిని నిలబెట్టేది మాట. మనిషిని పడగొట్టేది కూడా మాటే. మాట తీరును బట్టి లోకంలో మర్యాద లభిస్తుంది. అలాంటి మాట పసిడి కంటే విలువైనదని మేడం గారు అనుభవపూర్వకంగా చెప్పారు.

ఇవాళ నాగరికత పేరుతో వివాహమైన **"యువతులు మెడలో తాళి ఎందుకు"**? అంటూ ఉన్నారు. కాలికి మట్టెలు బరువు అంటున్నారు. ఇంకా చాలా వాటిని అపహాస్యం చేస్తూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల పట్ల నిరసన స్వరం వినిపిస్తున్నారు. దీన్నే **"ఫెమినిజం"** (స్త్రీవాద కవిత్వం)గా కొంతమంది ఆధునిక కవయిత్రులు తమ గొంతును బలంగా వినిపించారు. అభ్యుదయ భావాలున్న ఉమాదేవి గారు తరతరాల మన సంస్కృతిని స్త్రీలు గౌరవించాలని పిలుపునిచ్చారు.

**"పుస్తెలున్న పడతి పుడమిలో మాన్యయై
గౌరవింప బడును ఘనముగాను
మట్టెలు ధరియించి నట్టింట తిరుగంగ
నపర లక్ష్మి అనుచు నాదరింత్రు."**
(అక్షరవనం -పుట 36)

ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు పెద్దలు. ఆ ఇల్లాలు తాళిబొట్టు, ఆభరణాలతో మట్టెలు పెట్టుకుని నట్టింట్లో నడుస్తుంటే సాక్షాత్తు లక్ష్మీదేవి సంచరిస్తున్నట్టుగా కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు భావిస్తారు. ఇక్కడ లక్ష్మీదేవి సంపదకు కాదు రూప లావణ్యాలకు ప్రతీక.

**'పెళ్లయిందనడానికి సాక్షి తాళి;
అదికట్టకముందేఅయిందనుకుంటే
జీవితమంతా ఎగతాళి'**

అని ఓ మినీ కవి తాళి ప్రాధాన్యతను సంక్షిప్త సుందరంగా చెప్పారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్నను చాలామంది కవులు విస్మరిస్తున్నారు. ప్రభుత్వాలు సైతం పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతు జీవనం దుర్భరమైంది. ఉమాదేవి గారు రైతు దుస్థితిని వర్ణిస్తూ ?

**"వాన కురియ రైతు వదనము వికసించె
పంట పండు ననుచు పరవశించె
కుంభవృష్టి కురియ కుములుచు రైతన్న
ఘోరు మనుచు నేడ్చె పుడమి యందు."**
(అక్షరవనం - పుట 43)

ఈ పద్యం చదివి ఓ రైతుబిడ్డగా నేనూ కళ్ళు తుడుచుకున్నాను. జూదంలో ఓడిన ధర్మరాజులా, రథం క్రుంగిన రాధేయుడిలా, ఇవాళ రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

అమ్మను గూర్చి గురించి ఎంతమంది రాసినా, రాయవలసింది ఎంతో ఉంది. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యావంతు రాలు అయిన ఉమాదేవి గారు ఉత్తమ ఇల్లా లుగా, బిడ్డల ప్రేమకు పాత్రమైన మాతృ మూర్తిగా సంతోష జీవనం సాగిస్తున్నారు.

**"అమ్మ"** శీర్షికన మేడం గారు రాసిన15 పద్యాలు (పుటలు 50, 51) వారి వాత్సల్యాన్ని హృదయ ఔన్నత్యాన్ని చాటుతున్నాయి.

**"తల్లి ప్రేమకు ఎవడు ధరను కట్టగలడు"
"అమ్మ కన్న దైవ మవని నెవరు"
"అమ్మ మాట విన్న అన్ని భాగ్యములబ్బు"
"అమ్మ ప్రేమలోన అమృతము చిందురా"
"తాటియాకు మంట తల్లి కోపమురా"**
(అక్షరవనం - పుట 50/51)

వంటి పాదాలు బిడ్డల గుండెల్లో నాదాలై ప్రతిధ్వనిస్తాయి.

ఫేస్బుక్, వాట్సప్, ఇంటర్నెట్ వేదికగా మేడం గారు వివిధ గ్రూపులు నిర్వహించే పద్య ప్రహేళికలలో సమస్యలను సద్యః స్ఫూర్తితో పూరించారు. దత్తపదులను మెత్తని శయ్యలో అమర్చి అందమైన పద్యాలు రాశారు.'న్యస్తాక్షరి'ని చక్కని పదాల్లో, పాదాల్లో విస్తరించారు.

**"రమ్ము తోడ రామ మందిరమ్ము నిండె" అనే సమస్యను ?**

**"రామనవమి నాడట జేరి రమణులంత
తోరణమ్ముల భక్తి విస్ఫార మంద
రంగ వల్లులు దిద్ది తీర్చంగ సంబ
రమ్ము తోడ రామ మందిరమ్ము నిండె"**
(అక్షరవనం - పుట 55)

అని రాముడు **'రమ్ము'** జోలికి పోకుండా చేసి సంబ'రమ్ము'తో సంతోషాంతరంగుణ్ణి చేశారు.

**"శవ పూజల వలన జన్మ సార్థకమౌగా"** అనే సమస్యను **"కేశవ పూజలతో"** జన్మ సార్థకమైందంటూ సార్థకంగా పూరించారు. ఒకే సమస్యను భావ వైవిధ్యంతో సులభ సుందరమైన పద్యాలలో పూరించి మేడం గారు తమ పాండితీ ప్రకర్షను చాటుకున్నారు. చక్కటి గేయాలు, వచన కవితలు, వ్యాసాలతో అక్షరవనాన్ని పుష్పింప చేశారు.

తెలుగువారి నిత్య పారాయణ గ్రంథం భాగవతం. అందులోని 108 అంశాలను అందమైన ఆట వెలదుల్లో అద్భుతంగా రచించారు. 184 పేజీల్లో సుమారు 1000 పద్యాలలో సంక్షిప్త భాగవతాన్ని మనకు పరిచయం చేశారు.

**"వయసు మీరిన వానిని వివాహమాడి
తారయును దేవ గురువుకు దారయయ్యె"**
(శ్రీమద్భాగవతము ఆణిముత్యాలు-పుట 112)

అని ఓ పద్యంలో అంటారు. ముదిమి వయస్సులో ఉన్న బృహస్పతి తారను దార (భార్య) గా స్వీకరించాడు. యౌవనవతి, రూపవతి, అయిన తార, దారగా మారడం శబ్ద చమత్కారంతో పాటు వృద్ధ వివాహాలు నేరమన్న కందుకూరి, గురజాడలను ఉమాదేవి గారు ఈ పద్యంలో స్మరణకు తెచ్చారు.










కంసవధ ఘట్టంలో ?

**"జుట్టుముడిని బట్టి కొట్టుచు కంసుని
క్రిందకు పడవైచి కాలు తోడ
కొట్ట కదల లేక కట్టెవోలె బిగిసి
కోలు పోయె నుసురు గోడు మనుచు."**
(శ్రీమద్భాగవతము ఆణిముత్యాలు)
(పుట 145)

అచ్చమైన తెలుగు మాటల్లో వృత్యాను ప్రాసంతో కంసవధను కళ్ళ ముందు నిలిపారు.

భీష్మక మహారాజు కూతురు రుక్మిణిని భైష్మిగా యతి స్థానంలో నిలిపి పద్యానికి యతి ప్రాసలు ప్రాణ సమాలని నిరూపించారు.

**"పిడికెడటుకులొసగి పెన్నిధి తాపొందె
విప్రవరుడు తాను విశ్వమందు"**

అనే రెండు పాదాల్లో కుచేలోపాఖ్యాన్ని కుంచెతో గీసినట్టుగా చెప్పడం ఉమాదేవి గారికే సాధ్యం. శారదాంబ, హనుమత్ శతకాలతో పాటు "హనుమోదాహరణ కావ్యం" రాసి, ప్రక్రియా వైవిధ్యంతో పద్యాన్ని ప్రకాశింప చేశారు.

వేమన ఆట వెలదిలోని మూడవ పాదం, పదునైన దృష్టాంతంతో మన మెదడుకు పదును పెడుతుంది. ఉమాదేవిగారి శతకాల్లో చాలా పద్యాలు అందుకు దృష్టాంతాలు. ఆకర్షణీయమైన ముఖ చిత్రాలతో అర్థవంతమైన పద్యాలతో, రసప్రవాహంలా కవిత్వమై పరిమళించిన డాక్టర్ బల్లూరి ఉమాదేవి గారు కవయిత్రిగా తన ఎదుగుదలకు కారణ భూతులైన కుటుంబ సభ్యులను బంధుమిత్రులను, సమకాలీన పండిత కవులను కూడా కృతజ్ఞతా సుమాలతో అర్చించి తమ సంస్కారాన్ని చాటుకున్నారు.

**"బల్లూరి వంశమందున
కల్లయు కపటములు లేని కవియిత్రిగనే
తల్లి సరస్వతిని కొలిచి
అల్లితిని పద్యమాల నందుము హనుమా!"**

కల్లాకపటం లేని కవయిత్రి కనుకనే ఉమాదేవి గారు పద్యాల్లో మల్లెపూల సౌరభమై పరిమళించారు. "కవితా భూషణ" బిరుదుకు సార్థకత కలిగిస్తూ సరస్వతీ సమర్చన చేసి "సారస్వత మంజీర"గా సాహిత్య లోకంలో గుర్తింపు పొందారు.

తోపెల్ల బాలసుబ్రహ్మణ్యంశర్మ గారు, కాటేపల్లి లక్ష్మీనరసింహ మూర్తి గారు, డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య గారు, "శంకరాభరణం" కంది శంకరయ్య గారు, వరలక్ష్మి గారు, డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గారు,డాక్టర్ బండికాడి అంజయ్య గౌడ్ గారు, బి వెంకట్ కవి గారు, వంటి పండిత కవుల ప్రశంస లందుకొని సగర్వంగా పద్య కవితా శిఖరాన్ని అధిరోహించారు. పాఠకులు ఉమాదేవి గారి రచనలు చదివి "పద్య విద్యాపట్ట భద్రురాలి"గా మేడం గారికి నూటికి నూరు మార్కులు వేసి నిండు మనసుతో అభినందిస్తారని ఆశిస్తూ డాక్టర్ బల్లూరి ఉమాదేవి గారికి అక్షరాభినందనలు అందజేస్తున్నాను.

**"బల్లూరి ఉమాదేవివి
యెల్లలు దాటిన కవితలు హృదిమరిపించున్
మల్లెల సౌరభ మెసగగ
నల్లును పద్యముల నామె నద్భుత రీతిన్"**

**ప్రతులకు:** డా. బి.ఉమాదేవి
ఫోన్ నెంబర్: 9493846924
నంద కిషోర్:9403965999 (బెంగుళూరు)

## నవ్వుతూ బ్రతకాలిరా

మన చిరునవ్వు
రెండు మనసులను
కలిపే వారధి.
అపరిచితుల మధ్య
అడ్డుగోడలు కూల్చి
ఆత్మీయతను పంచే
అద్భుత స్థానం నవ్వు.
కోపాన్ని తగ్గించి
మనో శాంతిని చేకూర్చే
సాధనం నవ్వు
చిలిపి నవ్వుతో ఒత్తిడి
కరిగి పోతుంది.
మనసులో బాధల
బారం తగ్గిపోతుంది
వ్యాధినిరోధక శక్తిని
ఆయుస్సు పెంచే
ఆరోగ్య ప్రదాయిని
నవ్వు.
నవ్వడం ఒక భోగం
నవ్వించడం ఒక యోగం
నవ్వక పోవడం ఒక రోగం
పైసా ఖర్చులేని పరమ
ఔషధం నవ్వు
నవ్వుగుండె నిండా
సంతోషాన్ని నింపుతుంది.
ఆత్మీయతను పెంచి
మమకారాన్ని పంచి
మానవీయతను
చాటుతుంది.
చిరు నవ్వు శత్రువును
కూడా మిత్రునిగా
మార్చే సాధనం.
కంటి నిండా కలతలున్న
మెదడు నిండా ఆలోచనలున్నా
ఒక్క చిరునవ్వు చిందించి చూడు
నీలోని ఆందోళనలు కరిగిపోతాయి.
నవ్వే ఒక మందు
చింతలను పక్కన బెట్టు
చిరునవ్వును తోడుచేసుకో.
నవ్వుతో పలు సమస్యలు
పరిష్కారమై ప్రగతి
మూడు పువ్వులు అరవై
కాయలుగా వర్ధిల్లుతుంది.
నవ్వే నా కున్నది
నవ్వే నా పెన్నిధి
నవ్వే నా సన్నిధి
నవ్వే నా జీవితం
నవ్వే నా శాశ్వతం.
నవ్వు ను పెంచుదాం
నవ్వును పంచుదాం
నవ్వుతూ జీవిద్దాం
నవ్వుదాం నవ్విద్దాం.
అహంకారాన్ని పక్కనబెట్టి
నవ్వితేలోకం నీ చుట్టమైతది
నవ్వులే పువ్వులై
నలుగురితో నవ్వుతూ
సాగిపోతే జీవితం
వేడుకగా సాగుతుంది.
నవ్వుతూ బ్రతకాలిరా
నవ్వుతూ నడవాలిరా
నవ్వుతూ ఆడుతూ
పాడుతూ పనిచేస్తే
అలుపు సొలుపు ఉండదు
నవ్వుకు నీవు చిరునామైతే
నీ జీవితం ధన్యమౌతుంది
నవ్వే నీ జీవన శైలిలో
భాగం కావాలి
నవ్వడం యోగం
నవ్వక పోవడం రోగం.
నవ్వులతో నవ్వుల లోకం
అవతరించేను ఆందోళనలు
అంతమైఆనందం వెల్లివిరిసేను.
కుంగుబాటు కుదేలై
కులాసా సందడిలో
నవ్వుతో ఉత్సాహం
ఉల్లాసం ఉప్పొంగేను.
మనోల్లాసం ఉరకలు వేసి
ఆరోగ్యం వశమయ్యేను.
మనసు విప్పి నవ్వితే చాలు
సగం రోగాలు మాయం
నిత్యం నవ్వుతూ నవ్వులను
పంచుతుంటే జీవితం
ఆనంధమయం
ఆరోగ్యమయమౌతుంది
మానసిక ఆరోగ్యం
మెరుగుపడుతుంది.
నవ్వుల పువ్వుల తోటలో
శాంతి సౌభాగ్యం సిద్ధించేను



-నేదునూరి కనకయ్య
9440245771

## మాతృదేవోభవ....!

ఉ.
ఆలన యందు ప్రేమమయి హాయిని పంచెడి దివ్యమూర్తియే,
పాలనలోన యోగ్యతల పాటిని మించిన మేటియే కనన్,
లాలనబుజ్జగింపులను లక్షణసద్గుణమిచ్చు దేవియున్,
జాలిన పుణ్యగర్భమున జాతికి బిడ్డల నిచ్చు తల్లియే!

ఉ.
అమ్మయె తోడునీడ మన యందరి జన్మకు మూలమే యిలన్,
కమ్మని యుగ్గుపాల నిడు కామిత దాయిని దివ్యరూపిణీ,
యిమ్మహి మానవీయతల యింపుకు పెంపుకు కల్పవల్లియున్,
రమ్మని చేరబిల్చురస రాగము నిచ్చెడి యోగమూర్తియున్!

ఉ.
వీడని బంధమే జనని వీక్షణ జేయగ నాన్న తోడుగన్,
వాడని పూలపాదు ఘన వాసిగ సంతతి సాగుతీ గయున్,
నీడగ గాచునమ్మ శిశు నిర్మల నిశ్చల రూపుల న్నియున్,
వేడుక జీవనంబు తను విస్తృత ప్రేమల పంచు మాతయున్!



-డా.గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

## మట్టిలో మనిషి నిశ్శబ్ద సాక్ష్యం

మట్టిలో మనిషి తోలు
చీమలకు కడుపు నింపింది?
ఎండలో ఎండిపోయిన చర్మం
వానలో కరిగిన గౌరవం
జీవితం మొత్తం పోరాడిన దేహం
చివరికి నేలతో ఒప్పందం చేసుకుంది?
అవయవాలు ఒక్కొక్కటిగా
కాలం చేతికి అప్పగించబడ్డాయి,
పురుగుల పండుగగా మారిన మానవుడు?
జీవించి ఉన్నప్పుడు విలువలేని శరీరం
చచ్చాక ప్రకృతికి పంచాభక్ష పరమాన్నం?
కాల్రా ముందా కాయ కష్టం
పొలాల్లో చెమటగా జారింది,
బ్యాంక్ అర్రాలో మాత్రం
నంబర్లుగా మారి నిలిచిపోయింది?
అక్కడ జీవితం కాదు,
అంకెలే మాట్లాడతాయి?
రోజూ చచ్చే జీవితం
ఒక్కసారి శవమైంది,
కానీ బ్యాంక్ కి అది కూడా సరిపోలేదు?
"సాక్ష్యం కావాలి" అన్న చల్లని మాట
మానవత్వం గొంతు నులిమింది?
చివరి ఊపిరి
అన్నకు బహుమతిగా పెట్టిన చేతులు,
పైసా పైసా కూడబెట్టిన ప్రేమ
పత్రాల్లో చిక్కుకుపోయింది?
"తీసుకో అన్నా?" అన్న ఆత్మ
బ్యాంక్ గుమ్మం దాటలేక నిలిచిపోయింది?
సమాజం వెయ్యి వెర్రి తలలు
ఒకేసారి కదిలాయి?
బతికున్నప్పుడు చూడని కళ్ళు
చచ్చాక నిబంధనలు
చదివాయి?
శవం ముందు నిలబడి
నిబంధనలు చెప్పిన నోటులు
మనిషి కంటే పేపర్ గొప్పదని
మళ్ళీ నిరూపించాయి?
"నేల తల్లి పర్మిషన్ తీసుకో"
అన్నట్టు
జీతూ ముందా భుజాన ఎక్కిన
బాధ,
చనిపోయిన శరీరం
బ్యాంక్ కు రుజువు కావాల్సి
వచ్చిందా?
ఇది జీవితం కాదు,
ఇది వ్యవస్థ యొక్క వ్యంగ్యం?
19300 రూపాయలు
తిరిగి ఇచ్చిన చేతులు
డబ్బు ఇచ్చాయి గానీ
గౌరవం ఇవ్వలేకపోయాయి?
చివరికి ప్రశ్న మిగిలింది?
మనిషి విలువ
బతికున్నప్పుడు లేదా చచ్చాకా?
లేదా బ్యాంక్ పుస్తకంలోనేనా??
మట్టిలో కలిసిన మనిషి
ఒక్క మాట మాత్రమే చెప్పాడు?
"నేను మట్టినే?
మీరు కూడా అదే మార్గం?"



-ఎలగొండ రవి
9848770345

## అత్తారింటి పని మనిషి

స్త్రీ స్వేచ్ఛను మూడుముళ్లు మింగేస్తాయి
ఏడడుగులతో ఇంట్లో బంధీ అవుతుంది!
పెళ్లి కూతురు కట్నం తీసుకొని వచ్చి..
అత్తింటి పని మనిషి ఉద్యోగంలో చేరుతుంది!.

మౌనంగా లక్ష్య సాధన చేస్తే..
విజయ వార్త హోరెత్తుతుంది!
నీ అకుంఠిత వజ్ర సంకల్పానికి..
గమ్యం సహితం గడగడ వణుకుతుంది!.

అవాస్తవాలను ఎదిరించి చూడు..
బంధాలు వేగంగా విడిపోతాయి !
అభూతకల్పన కట్టుకథలు ..
తాత్కాలిక చప్పట్లను వినిపిస్తాయి !.

జీవితంలో సదా అద్భుతాలేం జరగవు..
ఆనందాన్ని విలాస వస్తువుల్లో వెతకకు !
మదిని కదిలించే చిట్టి నిత్య సంతోషాలే..
మనకు ఆత్మ సంతృప్తిని ప్రసాదిస్తాయి !.

ఖాళీ చేతులతో ఏడుస్తూ జన్మించి..
అన్నీ కావాలంటూ ఆరాటపడతాం !
నాది అన్నవన్నీ వదిలిపెట్టి..
ఒట్టి చేతులతో ఒంటరిగా వెళ్లిపోతాం !.

బ్యాంకు అకౌంట్ బ్యాలెన్స్ ప్రధానం కాదు ..
హృదయ భావనలే అసలైన అకౌంట్ !
ఈ రోజు నాకు దేవుడిచ్చిన అపూర్వ వరం..
ఉదయం నేను ఆరోగ్యంగా నిద్ర లేవడమే !.

డబ్బు వ్యామోహంలో మునిగిన స్త్రీలు..
మహిళల వెంట పడే నరక మృగాళ్లు..
నమ్మదగిన వ్యక్తులు అసలే కాలేరు..
వారు తమ కోరికల మంటల్లో భస్మమవుతారు !.

కొందరు దూరంగా ఉన్నా దగ్గరవుతారు..
కొందరు దగ్గరే ఉన్నా దూరం అనిపిస్తారు..
ఒక మనిషి అసలు విలువ..
మనకు దూరమైనపుడే తెలుస్తుంది !.

నిద్ర పోతున్న వారిని లేపవచ్చు..
నటించే వారు ఏం చేసినా లేవరు కదా !
కలియుగంలో చేదు నిజం విలువ కన్న..
అబద్దపు తీపి వెలుగులే మిన్న ఐపోయాయి !



- మధుపాళీ
9949700037

# తిరుగబడే నిషిద్ధుడు

ఎదిరెపల్లి కాశన్న రచించిన **'తిరుగబడే నిషిద్ధున్ని'** పుస్తకానికి వనపట్ల సుబ్బయ్య రాసిన ముందు మాట

**మండే మాదిగ డప్పులా**
**ఉదయిస్తున్న సూరీడుపై**
**చిర్రా, చిటికెనపుల్ల తీసుకొని**
**తొలకరి పాటకు దరువేస్తున్నాను-**

**చెప్పులు పారేసుకొని**
**నెత్తుటి మడుగు దాటుతున్న కాలానికి**
**కత్తి, ఆరె తీసుకొని**
**కన్నీళ్లతో చెప్పులు కుడుతున్నాను.**
**-మహాకవి శివసాగర్**

**మనువాదుల గుండెలపై**
**'మూలచుక్కై' పొద్దు పొడుస్తూ**
**అస్తిత్వ కాగడై నడుస్తున్నడు**
**సామాజిక అణచివేతలపై**
**'తిరుగబడే నిషిద్ధుని' దళిత రణం చేస్తూ**
**పోరు కెరటమై ఎదురెక్కుతున్నడు..**

ఎదిరెపల్లి కాశన్న రాస్తున్న కవిత్వమంతా దళిత అస్తిత్వం ధిక్కారమే. లందలోని కన్నీల్లను కలంలో సిరాగా దట్టించి అక్షరాలను విత్తనాలుగా నాటుతూ పాలకవర్గాలపై పోరు అస్త్రాలుగా సంధిస్తున్నాడు. తను మొదట రాసిన కవిత్వానికి 'మూలచుక్క' రెండో కవిత్వానికి 'తిరుగబడే నిషిద్ధున్ని' పేరు పెట్టడంలోనే తన అస్తిత్వాన్ని మరువని దళిత కవిగా స్పష్టమైతుంది. అతనిది తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రకల్ గ్రామం. ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగం రాలేదని నిరుత్సాహపడలేదు. నిత్యం ప్రజలలో ప్రజా పోరాటాలలో ఉంటూ అణగారిన కులాలను చైతన్యపరుస్తూ అంటరానితనం, అన్యాయాన్ని, శ్రమ దోపిడీని అడుగడుగునా నిలదీస్తుండడం ఆయన కవిత్వంలోని ప్రధాన భూమిక.

భాష తల్లిపాల నుంచి తల్లి ఒడిలో నుంచి మొదలైతుంది. ఏ సమాజంలోనైనా, భాష గురించి చెప్పాల్సివస్తే మహిళలు, అందులో శ్రామిక కులాలైన దళిత బహుజన మహిళలే నిపుణులు. అందుకే ప్రసిద్ధ కవి కీ.శే. డా॥సి. నారాయణరెడ్డి 'మా ఊరు మాట్లాడింది' పుస్తకాన్ని మాదిగ మహిళకు అంకితమిస్తూ.. మా ఇంట్ల పనిచేసే 'మాదిగామె' నుంచి నేను అద్భుతమైన జీవభాష నేర్చుకున్నానని చెప్పుకున్నాడు. అట్ల ఎదిరెపల్లి కాశన్న కూడ తన వాడలో, ఊరిలో, అమ్మలు, చిన్నమ్మలు, నాయినమ్మ, అమ్మమ్మలు, అత్తకోడళ్లు, వదినె మరదళ్లు మాట్లాడుకునే దళిత ఈస్తటిక్స్‌ను అద్భుతంగా పట్టుకొని కవిత్వంలోకి ఒంపాడు.

కాశన్న వస్తువుల కోసం వెతుకులాడే కవిగాదు. నిత్యం ప్రజల గాయాలనే వస్తువులుగా ఎంచుకొని కవిత్వంగా మలుస్తూ సోషల్ మీడియాలో రోజూ తన కవితలను పోస్టు చేయడం మనం రోజూ చూస్తున్నదే. అవి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

కాశన్న కవిత **'తిరుగబడే నిషిద్ధున్ని'**లోని పాదాలను ఒకసారి చదువుకున్నట్లైతే..





ప్రతులకు: ఎదిరెపల్లి కాశన్న
ఇ.నెం. 14-385/1/ఎఫ్/1
నియర్ కరెంట్ ఆఫీస్, హౌసింగ్ బోర్డ్,
గ్రా:నాగర్ కర్నూల్
మం, జిల్లా: నాగర్ కర్నూల్
తెలంగాణ-509 209
సెల్: 9640006304
9553346883

**'మేము మాట్లాడినప్పుడు/పూలదండలు వేసిన మస్తాలే/ఇప్పుడు మా మెడకు ఉరి తాళ్లై బిగుస్తున్నాయి/నేను అస్తిత్వం ఉన్న అనాథను/ తిరుగబడే నిషిద్ధున్ని/ మాకు ఏం తెచ్చింది ఏం ఇచ్చింది?/ అర్ధాయుష్షుతో వెళ్లిన ప్రాణాలు/ పొగచూరిన వెన్నెల రాత్రులు/ కలల చుట్టూ కంచెలు, దృశ్యాలు'** అంటూ.. అధికార పాలక వర్గాలు దళితులు, బలహీనవర్గాలకు, హామీ ఇచ్చిన సంక్షేమ వాగ్దానాలు అమలుచేయాలని, అట్లా అమలు చేయని అగ్రకుల విధానాలను ఒక్కొక్కటిని తూర్పారబడుతున్నాడు. తన్నుడు నీతులను, కులగజ్జిని ఎండట్టి సమాజ అసమానతలపై గూటంతో కసిగా గుద్దుతున్నడు.

భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న కాలంలో దళితులకు నేటికీ స్వాతంత్ర్యమే రాలేదని దేశంలో జరుగుతున్న కుల, మత, వర్ణ వివక్ష సంఘటనలే ఇందుకు నిదర్శనం, తార్కాణమని ఈ సంకలనం 'తిరుగబడే నిషిద్ధున్ని'లోని ప్రతి కవిత ద్వారా చైతన్య కెరటమై కదిలిస్తున్నడు, నడిపిస్తున్నడు.

నిచ్చెనమెట్ల అసమానతల సమాజంపై దుఃఖిస్తడు. కుమిలిపోతడు. మనిషిని మనిషిగా చూడనందుకు 'బాధగా ఉంది' అంటూ వలపోస్తడు. కుక్కలను, పందులను, గుర్రాలను, సర్పాలను ప్రేమించే మనుషులు.. దళితులను ఈసడిస్తున్నరు, వెలేస్తున్నరు హత మార్చుతున్నరు. పూలే, అంబేద్కర్ విగ్రహాల చేతులు, కాళ్లను ధ్వంసం చేస్తున్నరు. ఈ సంఘటలన్నిటినీ కాశన్న కవిత్వీకరించాడు.

వెలివాడలపై కురిసిన వరాల జల్లులు ఏమైనవని? ఏ కులోన్మాది ఎత్తుకుపోయాడని కలాన్ని ఝులిపిస్తూనే, నడుస్తున్న బాటలో గాయాల నెత్తురును దోసిట్లకెత్తుతున్నడు. మండుతున్న డప్పులా పదునెక్కిన కూతపెడ్తున్నడు. మనసులోని ఆశ,.. నిరాశగా మిగిలినందుకు ఉద్యమానికి తిరుగబడే నిషిద్ధుడై నిప్పుల దండోరేస్తున్నడు, కోలాట కోపులై దరువేస్తున్నడు.

ఆకాశంలో సగమైన మహిళలకు, దక్కాల్సిన సమానత్వాన్ని ఎవడు, ఏ దుర్మార్గుడు, ఏ వలసవాది దోచుకుపోయాడని, వర్గీకరణంటే విడిపోవడం గాదని, సమాన వాటా సమాన న్యాయమని, అమరుల త్యాగాలు నీటి మూటలైనవని, చదువుకు ఫీజులు కట్టలేని పరిస్థితిని, దళిత పుట్టుకే వ్యర్థమని, దేశాన్ని దోచుకుతినే దొంగలను, దొంగ స్వాములను, కామబాబాల పైశాచికత్వాలను, పల్లజీరు తూనే కాషాయ కసాయితనాన్ని ఎండగడ్తున్నడు. వాపును చూసి మురిసిపోతే మాడిమసైపోతరని ఆత్మగౌరవంపై కండ్లెర్ర జేస్తున్నడు. 'తిరుగబడే నిషిద్ధున్ని' సంపుటిలోని ఎదిరెపల్లి కాశన్న ప్రతి కవిత దళిత పాదాల స్పర్శతో నిరసన బాటగా ప్రవహించింది.

ఈ సంపుటిలో సంఘసంస్కర్త దళిత వైతాళికుడు, ఆది ఆంధ్ర స్థాపకుడు, మహనీయులు భాగ్యరెడ్డివర్మ, అణగారిన వర్గాల అభ్యున్నతికై పాటుపడిన మాజీ ఆర్థిక శాఖ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్, ప్రజా పొద్దుకై సమసమాజ వెలుగులకై పాటను ఎరుపెక్కించిన అరుణోదయ రామారావు, జీవితాన్ని తెలంగాణకే అంకితం చేసిన మహోపాధ్యాయుడు తెలంగాణ జాతిపిత జయశంకర్‌పై, దళిత ఉద్యమ బావుట మూలవాసి పాట ఎర్ర ఉపాలి ఇలా ఎందరో అమర వీరులపై ఆత్మీయంగా, వినమ్రంగా నివాళులు అర్పించిన మంచి మంచి కవితలెన్నో మనస్సుని తడిచేస్తాయి.

నాయిన సవారయ్యపై రాసిన **'చరిత్రను సృష్టించాడు'** కవితలో **'ఇంటినిండా పిల్లలు/ అరెకు మిగ్గును అద్ది/ చెప్పుల నిప్పుల దర్వై మోగిందు/హరిశ్చంద్రుడనోలే/ కాటికాపరైందు/ తన పిల్లలు చదువుకోవాలని/ నోరుకట్టుకొని/ ఆకలిని దిగమింగి/ చెప్పులు కుట్టిన చేతులతో/ డాక్టర్‌ను చేసి చరిత్ర సృష్టించాడు'** అని తన తండ్రి కష్టాన్ని కవితగా మలిచాడు. అమ్మ మశమ్మ లేకపోయినా నాయిననే అమ్మ నాయినై తనతోపాటు ఇద్దరు తమ్ముళ్లను చదివించి ఒక తమ్మున్ని డాక్టర్ కోర్సు చదివించడానికి తగిలిన తట్లెన్నో.. మోసిన బరువులెన్నెన్నో.. చెప్పులు కుట్టిన చేతులతో డాక్టర్‌ను చేసిన చరిత్ర నాయినది అని చెప్పటం నాయిన సవారయ్య త్యాగం తపన మనకెంతో ఆదర్శం.

మానవ సమాజాన్ని కబలిస్తున్న కరోనాపై కవితలను పదునెక్కిస్తూనే.. క్వారంటైన్ సెంటర్లో దళిత మహిళ అన్నం వండితే అన్నాన్ని బహిష్కరించి నానా హంగామా చేసిన కుల కరోనాగాళ్లను బజారు కీడ్చి తిరుగబడాలె, ఎదురుతిరిగాలె, కలెబడాలె, గెలువాలనె సామాజిక న్యాయ సంకల్పాలను ఎలుగెత్తి చాటుతూనే మూలవాసుల గుండె డప్పును కణకణకణ మోగిస్తున్న మిత్రుడు ఎదిరెపల్లి కాశన్న వచ్చే కాలంలో పచ్చని కంకుల్లా ఎర్రెర్రని మిరుపపండ్లలా కవిత్వాన్ని అందించాలనే తపన సంతోషదాయకమైనది. ఆ దిశగా అధ్యయనం సూక్ష్మ దృష్టి ఉంటే గాని సాధ్యపడదు. చిన్నప్పటి నుంచి పుట్టి పెరిగిన ఊరు నాగర్ కర్నూల్ (కందనూల్).

**'కమ్మని కందనూలు'** కవితలో **"చెరుగని చరిత్ర/ సురభి రాజుల కోట/ప్రసిద్ధి గాంచిన/ కొల్లాపూర్ మామిడి/ పేదల ఆకలి తీర్చే సీతాఫలం/ కొంగు బంగారమైన/నాయినపల్లి మశమ్మ/ ఢిల్లీకి వెలుగైన/ఎత్తరావుని గట్టు/ మత సామరస్యానికి ప్రతీక/ రంగాపూర్ ఉర్సు"** నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మామిడికీ ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. బహుజన తల్లి, పేదల దైవం 'నాయినపల్లి మశమ్మ'ను ప్రతి ఆదివారం ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తూ తీరొక్క మొక్కులు తీర్చుకుంటరు. మత సామరస్యానికి ప్రతీకైన 'రంగాపూర్ ఉర్సు', ఏటా జరిగే గంధోత్సవం గొప్ప పుణ్యస్థలాలు. స్థానిక విశేషాలను సమాజానికి ఎరుక చేసే సాహిత్యం ఇందులో చోటుచేసుకోవడం గొప్ప అనుభూతి, విస్తృతంగా దళిత తాత్విక భూమికతో కవితలు రాయడం తన స్థానికతను తెలియజేస్తున్నది.

కాశన్న అందించిన తొలి కవిత్వ సంపుటి 'మూలచుక్క'ను ముద్దాడుతూనే.. రెండవ కవిత్వ సంపుటి 'తిరుగబడే నిషిద్ధున్ని' గుండెలకు హత్తుకుంటూ.. హృదయ పూర్వక అభినందనలు.

మరోసారి 'తిరుగబడే నిషిద్ధుని'కి
జై పూలే జై భీమ్‌లతో జేజేలు..
జయజయహో కవిత్వం.



**- వనపట్ల సుబ్బయ్య**
సెల్:9492765358

# మూలాలను తడిమిన మూలవాసి

ఎదిరెపల్లి కాశన్న రచించిన **'మూలచుక్క'** పుస్తకానికి అమ్‌గోత్ వెంకట్‌పవార్ రాసిన ముందు మాట

**మబ్బులు సూర్యుణ్ణి కప్పిపెట్టలేవు**
**మొలుకల్ని భూమి నిలువరించలేదు**
**అలల్ని సముద్రం ఆపలేదు**
**కవిత్వాన్ని కంచెలతో బంధించలేము**

-గత, వర్తమాన సంఘటనల పట్ల కవి త్వంతో స్పందించి అక్షర రూపంలో భవిష్యత్ తరాలకు అందించాలనే తపన ఉన్న కవి ఎదిరెపల్లి కాశన్న. అతని స్పందనలు తన మూలాలు, తన అస్తిత్వంలో నుండే పుట్టు కొచ్చినవి. సమాజాన్ని, సంస్కృతిని, సాహి త్యాన్నీ దళితుల దృష్టి కోణం నుండి పరిశీ లించి, లోచూపుతో రాస్తున్న కవిత్వం, తన స్వీయ జీవితానుభవాలను, అనుభూతులను, ప్రతిభావంతంగా చిత్రీకరించడం తన కవి త్వానికి గీటురాయి. కవి త్వంలో చాలాకాలం పాటు శిల్పం, వస్తువు, చిక్కదనం, శైలీ, మార్మికత వంటి అంశాలు తిష్ట వేసుకుని కూర్చోవడం వల్ల సామాన్యుల దరికి అది చేరలేదు. తన చుట్టూ ఉన్న సమస్యలు వెం టాడి భావోద్వేగంతో నాలుగక్షరాలు రాసేలా పురికొల్పుతాయి. అటువంటి ఆవేదనల నుండి పుట్టుకొచ్చిన కవిత్వమే ఈ మూల చుక్క.

చాతుర్వర్ణ వ్యవస్థ పునాదులను పెకిలించి సర్వమానవ సమతాధర్మం చాటిన గౌతమ బుద్ధుడి నుండి తనకు జన్మనిచ్చిన చంద్రకల్ గ్రామం వరకు గల అనేక సమస్యలను ఇతివృత్తం, వస్తువుగా తీసుకొని కవితలను రాయడం గొప్ప విషయం. బహుజన ఉద్యమ పరంపరలో మహనీ యులైన మహాత్మాజ్యోతి భాపూలే, పూలే వారసత్వాన్ని కొనసాగించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ల ముందు చూపు, త్యాగం, సేవలను స్మరించుకున్నాడు. అదే వరుసలో చిట్యాల ఐలమ్మ తెగువ, పోరాట పటిమను కీర్తిస్తూనే నాగర్‌కర్నూల్‌లో జాతీయోన్నత పాఠశాలను కట్టించి బడుగుల జీవితాల్లో ఎందరికో అక్షర వెలుగుల్ని ప్రసరింపచేసిన పాపయ్య పార్సా వరకు గుర్తుకు చేసుకు న్నాడు.

తన జాతికి వేల సంవత్సరాలుగా జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ..

**త్యాగాల నావను**
**జమిడికె దరువును**
**మనువు గుండెలో బాకును**
**దోపిడి గుండెలపై**
**నిప్పుల దరువునై**
**కొత్త ప్రపంచానికి**
**దారి వెతుకుతున్నాను...**

అంటూ నూతన సమతా మార్గాన్ని అన్వేషిస్తాడు. మాదిగలు పశువులను మచ్చిక చేసుకుని వ్యవసా యం చేయడం, చనిపోయిన పశువు చర్మంతో వారు మొత్తం సమాజానికి తోలు వస్తువులు అందించిన





ప్రతులకు: ఎదిరెపల్లి కాశన్న
చంద్రకల్ గ్రామం
పెద్దకొత్తపల్లి మండలం
నాగర్‌కర్నూల్ జిల్లా500 412.
సెల్:9640006304

గొప్ప ఉత్పత్తి కులం. సచ్చిన పశువు చర్మం తీయడానికి ఎన్నో రసాయ నాలు కనుగొన్న మొదటి శాస్త్రవేత్తలు వారు. అలా తోలుతో ఎన్నో సంగీత వాయిద్యాలు, తోలుతిత్తి, చెప్పుల్ని అడుగు కులాలన్నింటికి అందించిన మహోన్నతులు.

బహుజన కులాలైన మంగలివారికి అసిపె, గౌండ్లకు మొకుతాడు, కల్లు నింపే తిత్తులు, గొల్లకురుమలకు సంచులు, కమ్మరి తిత్తులు అందించింది. మొత్తంగా సబ్బండ కులాల సుఖదుఃఖాల్లో సమస్తం పాలు పంచుకున్న డప్పు మాదిగల తయారీనే. అందుకే ఈ కవి సమాజం మాదిగీకరణ చెందాలి అంటాడు. మొత్తం సమాజం యొక్క అవసరాలు తీర్చిన మాదిగలు తిరిగి పాలకులుగా మారాలని కోరుతూ బహుజన సమాజం పాలకుల కుట్రలకు బలికాక పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిస్తాడు. నాడు జంబూద్వీప పాలకులుగా ఉండి మనువాదం కుట్ర ఫలితంగా నేడు పాలితులుగా మారిన తన జాతి

**అగ్రవర్ణ పోరాట పాదాల చాటున**
**గ్రహణం పట్టిన సూర్యుడిలా**
**మాదిగల త్యాగాల చరిత్ర**
**కనుమరుగైంది**

అంటూ ఆవేదన చెందుతాడు.

తరతరాలుగా వస్తున్న తన కులవృత్తితో చేసిన చెప్పు, తోలు డప్పుతో పాటకు తోడై దోపిడీదారుల గుండెల్లో వణుకు పుట్టించి, రాజ్యాధికార బాటకు కణకణ మ్రోగే నిప్పుల డప్పును నేను, మాదిగ డప్పును నేను అని డప్పు యొక్క అంతరంగాన్ని, ఆత్మను ఆవిష్కరిస్తాడు. మనిషి కాళ్ళకు రక్షణగా నిలిచిన మాదిగ చెప్పు అంటరానిదై పోయిందని బాధ పడుతూనే కురుమూర్తి కొండపై ఉద్దాలుగా కొలువైనందుకు గర్విస్తున్నా అంటాడు.

మాదిగ ఇంట్లో పురుడు పోసుకున్న కిర్రు చెప్పుల ధ్వని సౌందర్యాన్ని అద్భుతంగా వర్ణించిండు.

**కిర్రు చెప్పులు తొడుక్కుని**
**సంధ్యవేళల్లో దారివెంట పోతుంటే**
**సప్తస్వరాలు పలికేవి**
**ఆ స్వరాల సవ్వడికి**
**తేళ్లు, పాములు సయ్యాటలాడేవి**
**సర్కార్ తుమ్మ, పల్లేరు ముండ్లు**
**వంగి దండం పెట్టేవి**

వారి ఇండ్లలో పుట్టిన డప్పుకు, పాటకు ఎనలేని సంబంధం ఉంది. కాలికి గజ్జెకట్టి పాట పాడితే, దానికి తగ్గట్టు డప్పుల దరువు తోడైతే, పాలకుల గుండెల్లో బాకు దిగినట్లే. పోరా టాలకి పదును పెట్టినట్లే. అలాంటి పాటలు పల్లె జానపదాలుగా పురుడు పోసుకుని ప్రజా ఉద్యమాల్ని ఉరకలెత్తించి సాయుధమై ముందుకు ఉరికింది.

రాజరికపు కోటల్ని కుప్పకూల్చింది. అదే డప్పు దర్బన్‌లో దండోర వేసింది. తెలంగాణ ఉద్యమ ధూంధాం అయ్యి ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైంది అంటాడు.

మనువాద బ్రాహ్మణిజం గత చరిత్రను మసిపూసి మారెడుకాయ చేసి, తప్పుగా చిత్రీకరించిందని అటువంటి చరిత్రను తన మాదిగ చెప్పుతో మార్చడానికి ప్రయత్నం చేస్తా అంటాడు. బ్రాహ్మణిజం మనిషిని మనిషిగా కాక జంతువుల కన్నా హీనంగా చూస్తూ, మనిషి తినే ఆహారం, వేషధారణపై దాడి చేస్తుందని చెబుతూ..

**ఆకలితో అల్లాడుతున్న**
**కడుపు మంటలపై దాడి**
**ఆకలి పేగులు ఉరితాళ్ళై**
**తిరగబడతాయి**
**జాగ్రత్త!**

అని హెచ్చరిస్తాడు. అల్ప ప్రాణియైన చీమల శ్రామిక నైపుణ్యాన్ని వర్ణిస్తూనే మొత్తం బహుజన సమాజాన్ని వారి శ్రామిక నైపుణ్యాన్ని గుర్తు చేస్తూ బలహీనులంతా ఏకం అయ్యి రాజ్యాధికారం సాధించాలని హితబోధ చేస్తాడు.

తెలంగాణ కోసం చేసిన బలిదానాలు ఎవరివి? ఫలాలు ఎవరికి దక్కిందని ప్రశ్నిస్తాడు. పునర్నిర్మాణం పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలంటే సామాజిక తెలంగాణ ద్వారానే సాధ్యం అని అంటాడు.

సాధించిన తెలంగాణ సబ్బండ వర్గాల ఉమ్మడి సొత్తు అని అందరికి అధికార, ఆత్మగౌరవ వరాల జల్లు కావాలని, ఫలాలు అందరికి సమానంగా దక్కాలని ఆవేదన చెందుతాడు. తెలంగాణ పోరాటంలో బలిదానాలు చేసిన అమరవీరుల త్యాగాలకు సలాం చేస్తాడు.

మొత్తం సమాజంలోని బహుజన ఉత్పత్తి కులాల వృత్తి నైపుణ్యాన్ని, శ్రామిక సౌందర్యాన్ని, వారి త్యాగాలను గుర్తు చేసు కుంటూ వారి జీవితాల్లో ఎటువంటి మార్పు లేదు అని ఆవేదన చెందుతాడు.

సామ్రాజ్య వాదం వారి వృత్తులను ఎలా ధ్వంసం చేసిందో మన కళ్ళకు కట్టేలా రాసిండు.

కవి, కవిత్వం రెండు ప్రజల పక్షాన నిలబ డాలని, పెన్ను రూపం మారి మాటకు, చేతకు, రాతకు పొంతన లేకుండా వస్తున్న కవిత్వాన్ని ప్రశ్ని స్తాడు. జన్మనిచ్చిన అమ్మ రుణం తీర్చు కోవ డానికి తిరిగి ఏ కడుపులో పుడతా నంటూ అమ్మ పాదాలకు, అభినం దనం చేస్తాడు.

బహుజనుల బతుకుల్లో మూల చుక్క అయి రేపటి వెలుగు కోసం ఆరా టపడుతూ, తన కవిత్వాన్ని మరింత పదును పెంచుకొని భవిష్యత్‌లో బహు జన కవిత్వం మరో కవిని అక్కున చేర్చు కుంటుందని కవి మాటలోనే ఆశిద్దాం.

**ఉద్యమ జడివానలా**
**బుద్ధుని యోచనలా**
**అంబేద్కర్ బోధనలా**
**బహుజనుల అండగా**
**రాజ్యాధికార బాటగా**
**కుంపటి ఆరకుండా**
**నా కవిత్వంతో రాజేస్తా!!**

**-అమ్‌గోత్ వెంకట్‌పవార్**
సెల్: 94404 22020

## అంకాపూర్ మక్కవడలు

అకాల వర్షం ఆగం చేసిన ముచ్చట పక్కన పెడ్తే,
ఆ వర్షంకు,
నా మనసు ముచ్చటపడిన మక్కవడైంది,
కాళ్ళు అంకాపూరైనాయి,
పేరు పేరంతా కోడై కూసే ఊరు కదా,
ఆ ఊళ్ళో కోళ్ల బతుకులు పగోడికైనా వద్దురా బాబు,
సరే, నాకెందుగ్గానీ..
అక్కడ దారిదారంతా మక్కవడల ఘుమఘుమలే..,
కళ్ళు ఆగిన చోట,
వేడి వేడి ఫలహారం దొరకడం అంత ఈజీ కాదు,
ఎన్ని కార్ల బొజ్జలు నిండినాకో మన వాయి,
చేతిలోకి చేరినాక,
నోరు ఉప్పు ఉప్పుల తొందరగుడే.. నోట్లో
ఇట్టే కరిగే గుణం వెన్నకే కాదు
ఈ వడలకూ ఉంటది.. నమ్మండి,
టమాట చెట్నీతో ఒక్కో వడ కడుపులో దిగుతుంటే,
రుచులస్వర్గం మీదికి నిచ్చెన ఎక్కిస్తూనే ఉంటది..,
తిరుగు ప్రయాణం,
వానంత వెచ్చని జ్ఞాపకమై మిగిలిపోతది..
నా దృష్టిలో అంకాపూరు పేరులో ఉన్న సున్న,
మక్కవడనే..!
(అంకాపూర్.. నిజామాబాద్
జిల్లాలోని ప్రఖ్యాత గ్రామం )



**- డా॥కాసర్ల నరేశ్ రావు**
9441406252

## నానీలు

యువతలో
నైపుణ్యాలు
తగ్గిపోతున్నాయి
కృత్రిమ మేధస్సు పుణ్యమా అని.

వృద్ధాశ్రమం
కట్టిస్తున్నాడట,
సేవాభావంతో కాదు
ముందు ముందు డిమాండని

డాలర్ల మోజు
తాము అనాథలయ్యి
కన్నోళ్ళనూ
అనాథలను చేసింది..

**-బలరామ్ నగర్**
సెల్: 9440734907

పుస్తక సమీక్ష

# అంజయ్య గౌడ్ ప్రతిభకు నిదర్శనం ఈ యక్షగానం

మనిషి ఎదుగుతున్న కొద్దీ అతడి ఆలోచనల్లో మార్పులు వస్తుంటాయి. విద్య, జ్ఞానాన్ని ఎంత పంచితే అంతగా ఇంకా వృద్ధి చెందుతాయి. సమాజం, దేవ, కాల పరిస్థితులు రచయిత, కవిపై ఎంతగానో ప్రభావం చూపుతాయి. వీటికి అనుగుణం గానూ, వీటి ప్రభావంతోనూ ఆలోచనల్లో మార్పు మనకు వారి రచనల్లో కనిపిస్తుంది. బండకాడి అంజయ్యగౌడ్ గతం లో ఎన్నో శతకాలు ఆధ్యాత్మిక పరంగా తెలుగు సాహిఈ లోకానికి అద్భుతంగా రచించి అంది ంచారు. ముఖ్యంగా ఆ వేంకటే శ్వర స్వామివారి మీద ఎన్నో రచనలు రుచితంగా మన దోసిళ్లలో పోశారు. వేంకటేశ్వర శతకము, శ్రీ వేంకటేశ్వర స్తుతి, యాదాద్రి వైభవం వంటివి అందరి ప్రశంసలను అందుకు న్నాయి. ఇప్పుడీ శ్రీ వేంకటేశ్వర కళ్యాణము, యక్షగానాన్ని అందించడం చూస్తుంటే వీరికి లభించిన బిరుదులు సార్థకం అయ్యాయనిపించాయి. ఈయనో సహజకవి. తెలంగాణాలో రూపొందిన జానపద రీతుల్లో యక్షగానం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. ముఖ్యంగా వారి వేషధారణ, వాచకం, పద్యాలా పన ఎంతో ఆకర్షణీయంగా వుంటాయి. ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఎంతో మంది రచయితలు యక్షగానాలు రచించి మెప్పించారు. అంజయ్య గౌడ్ అవధాన భారతి బిరుదాలిం కృతులు. విశేషంగా రచనా ప్రతిభ కలిగిన గౌడ్ గారు ఈ యక్ష గానాన్ని గొప్పగా అందిం చారు. ఎన్నుకున్న ఇతివృత్తం తెలుగు వారికి ఎంతో ఇష్టమైనది. ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామివారి కథను ఎంచుకోవడం వీరి తపనకు నిదర్శనం. కవికి తెలంగాణా జానపద కళా సంప్ర దాయం అంటే ఎంత ఇష్టమో తెల్సిపోయింది. ఇందులోని పాత్రలూ, కథా అందరికీ తెల్సిందే అయినా సన్నివేశాలను తీర్చిదిద్ద డంలోనే వుంటుంది రచయిత ప్రతిభ అంతా కూడాను. ఇందు లో గానంతో పాటు, వచనం కూడా వుంటుంది. ఇక దరువు ఆటతాళం ఈ యక్ష గానానికి ఒక విధంగా ప్రాణం. ఇంతే కాదు





ప్రతులకు: బి. అంజయ్య గౌడ్,
రేణుకా నిలయం, 2-11/231,
మల్లంపేట బాచుపల్లి,
శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్, ఫేస్-1
డ్రీమ్‌విల్లా అపార్ట్‌మెంట్ ఎదురుగా,
హైదరాబాద్-500 090

నటీనటులు తమ హావభావాలతో బాటుగా, పాటకు తగ్గట్లుగా చిందులు వేస్తారు. చూస్తుంటే అది ఎంతో రమ్యంగా, భగవద్గీత, రామాయణ, భారత, భావ తాల్లోని విషయాలూ మనకు స్ఫురిస్తాయి.

**తరుణితో మాటలాడుచు తన్మయమున**
**మిమ్ము నే జూడ లేదయ్య, రమ్ము,రమ్ము**
**వరము మునీంద్ర, భృగుచంద్ర,**
**వరగుణాఢ్య,**
**కోపమేలను శాంతించు, తాపసేంద్ర**

శ్రీ వేంకటేశ్వర ఆవిర్భావానికి ఇదొక ముఖ్య ఘట్టం. కవి ప్రతి సన్నివేశాన్నీ ఎంతో రమ్యంగా యక్షగాన ఆటగాళ్ళకు సులభం గా వుండే విధంగా రచించారు. లక్ష్మీదేవి అన్న మాటలు ఎంతో అద్భుతంగా వున్నాయి. 'పతుల కును రోషమును లేని, వారి సతులు, జగతియందున చింత తో సాగవలసి వచ్చునో దేవ పద్మాక్ష, వాస్తవంబు గాన నీయెడ నేనుండలేను స్వామి' అంటూ, రుక్మిణి, చంద్రమతి, సావిత్రి, ద్రౌపది, పార్వతి కథలను ప్రస్తు తించడం ప్రేక్షకులను ఇట్టే ఆకట్టు కునే డైలాగుల వంటివనే చెప్పా ల్సి వుంది. కవికి చందోభద్దంగా రాయడంతో ప్రావీణ్యమే గాక నాటకీయతలో కూడా కించిత్ ప్రవేశం కావాల్సి వుంది. ఇది ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా ప్రదర్శించే ఒక దృశ్య కావ్యం వం టిది. యక్షగానాన్ని ప్రారంభిం చడంలో ప్రేక్షకులను కట్టి పడేసే ఎత్తుగడ ఒక ఎత్తైతే, చివర్లో కథ ను ముగించడం కూడా మరొక గొప్ప కళ, గౌడ్ గార్కి ఇందులో ఎంతో అనుభవం వున్నట్లుగా, వకులమాత పూలమాలగా స్వామివారి గళమున జేరగ, గోవిందరాజులు శలారూపము ధరించినంత, సురలు పుష్ప వర్షము గురిపించినట్లుగా సన్నివేశాన్ని రక్తి కట్టించారు. ఆ తర్వాత ఎంతో ప్రముఖమైన స్తోత్రాన్ని, శ్లోకాన్ని చదివించారు, మంగళ హారతి ముందు. చదువుతున్నప్పుడు యక్షగాన కళాకారులను ఊహించుకుంటే అద్భుతంగా వుంటుంది. ఇక నేరుగా సరైన యక్షగాన కళాకారులు ప్రదర్శిస్తే మరెంత బాగుంటుందో నేను మాటల్లో రాయలేను. బండకాడి అంజయ్య గౌడ్ ధన్యులే అని చెప్పాలి.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## రసాయనాలు పాలవుతున్న... పాలు...!

ఏవి పాలో... ఏవి కర్రి ఆవు పాలో
తెలియక తెల్ల మొహాలు వేస్తున్నాం
పాలలో యూరియా నురుగులను చూసి
అవే గేదె పాలని ఆద మరచి పోతున్నాం...!

ఇన్నాళ్లు దినుసులలో కల్తీలను చూశాం
తినే పదార్థాలలో నకిలీల లీలను చూశాం
చాన్నాళ్లు పాలలో నీళ్లు సగపాలను కన్నాం
ఇప్పుడు క్షీరంలో రసాయనాలు చూస్తున్నాం
ఆబాలగోపాలం పాలను తాగి చస్తున్నాం..!

మనిషిలో పచ్చి స్వార్థాలు నేడు పెరిగాయి
మనసు మమతలు చచ్చి పోయినాయి
అన్ని వ్యాపారాలు అవినీతితో మకిలంటే
రోజులలోనే తాను కరోడ్ పతి కావాలంతే..!

దేవుడు లడ్డూ లోనే జీవుడు కల్తీలు చేసాక
పాలలో కల్తీ కి ఎందుకు వెనుకంజ వేస్తాడు
తల్లిపాలు లేని పిల్లలకు గేదె పాలే శరణ్యం
ఇప్పుడు ఆ పాలు తాగి తల్లడిల్లు తుండే..!

రైతులు దిగుబడులకు అత్యాశ పడుతూ
ఆహార ధాన్యాలన్నీ రసాయనాల మయమే
పదార్థాలు ఒంట్లోకి చేరాక అన్నీ పెద్ద రోగాలే
అదనంగా తాగే పాలలో గరళాలు కలుపుతూ
మరణ శాసనాలను రాయకండి... కల్తీ వర్తకలారా...!

పాల కల్తీల ప్రభువులను పాలకులు వదలొద్దు
బాధితుల కుటుంబాలకు భరోసాని ఇవ్వాలి
పుడ్ కమీషన్ యంత్రాంగం చిత్తశుద్ధితో
పని చేయాలి



**-జి.సూర్యనారాయణ**
6281725659

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1793వ రోజు 'తోటికోడలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'తోటికోడలు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## ఒకరికి మరొకరి సాయం

అప్పటిదాకా అపరిచిత ఇంట్లోకి
కోడలిగా అడుగుపెట్టడం పెద్ద సాహసం
మెట్టినింట తోటికోడలే
అవగాహన చేయించే సాధనం
ఆమె కూడా మరో ఇంట పుట్టి
ఈ ఇంట మెట్టిన జీవనం.
లోటుపాట్లు మాటతేడాలు
అభిప్రాయ భేధాలు
అభిరుచుల సౌధాలు
పతిదేవుని సంతోషింపజేసే
ప్రయాసలకు దోహదకరం
తోటికోడళ్లు ఇంటి స్తంభాలు
ఇంటినంతని
కనిపెట్టుకుని ఉండే కంటిదీపాలు
అత్తమామలకు తృప్తినిచ్చే
ఆశాదీపాలు.
కడుపు భారమైతే
తోడుండి తీరుస్తుంది
చిరు కోర్కెలు
పరాచికాలకు వి
చార విమర్శలకు
చనువుల సహేళి
పిల్లాజెల్లలకు
అమ్మ తరువాత అమ్మ
తోటికోడలు.
అసూయలు విభేధాలు వదిలి
అత్తింటిని స్వర్గధామం చేసే
తోటికోడలు.
ఇంట బయట మాన మర్యాదలు
రక్షణ భద్రతలు
సమన్వయ సహకారాలను
నెలకొల్పే తోటికోడళ్లు.
పుణ్యం కొద్ది మొగుడు
పూజల కొద్ది తోటికోడలు
తోటి కోడళ్లు
అక్కాచెల్లెళ్ల కంటే
అధికంగా కలిసిపోవచ్చు.
అదే ఆదర్శం
పలు కుటుంబాల నిదర్శనం.

-రాజప్ప

## యారాలు

కం. విస్తృత కథనము కలిగెను
ప్రస్తుతమగు వస్తువునిది ప్రస్తుతి జేయన్
వాస్తవము తోటి కోడలు
నేస్తముతానెప్పుడైననిజమగు బ్రతుకున్!!
కం. ఉమ్మడి సంసారమ్ముల
సమ్మతితోకలిసిమెలిసిసౌఖ్యముపొందన్
కమ్మనిబంధపు సోదరి
యిమ్మహి యారాలు వంశమెప్పుడు గెలువన్!
కం. ఎక్కడ పుట్టిన కానీ
యిక్కట్లనుద్రుంచి గెలివ స్వేచ్ఛనుగననీ
లెక్కలు లుకలుకయననీ
చక్కని యారాలుమైత్రిసంపదలిచ్చున్!!
ఆ.వె. పెండ్లి రోజునుండి పేర్మితోమెలగనీ
బరువు బాధ్యతలకు పాట్లుపడని
కష్టసుఖములందుకలహాలుకలగనీ
తోటికోడలెపుడు దూరమవదు!!
ఆ.వె. వైరిభక్తి తోడు వదలని దైవమై
రామరావణాది రసనపేరు
నొకరినొకరు దల్చినోర్పుగానున్నట్లు
తోటికోడలనగ త్రోయలేదు!!
ఆ.వె. మాటమాటలోనిమర్మాలనెంచుచు
గుసగుసలను పెట్టు కొమ్మలైన
పొరుగువారి ముందు పొసుగును యారాలు
నింటిపరువుగాచుజంటలగును
కం. అక్కా చెల్లెలు రీతిగ
మక్కువతో బంధముండి మైత్రిని కలుగన్
చక్కనియాదర్శమ్ముగ
చిక్కగ యారాళ్ళపలుకు సేవలుగెలుచున్.

-మాడుగుల నారాయణ మూర్తి

## నిఘా నేత్రం!!

అతి సామాన్య విషయం
కోడలి పాత్రలో ఒదిగిపోవడం!
మరి దానికి
రంగూ హంగు కల్పించే అదృశ్య శక్తి
తోడికోడలు!
కలిసిమెలిసి పోయినా
కాపట్యపు మనిషైనా
ఆమె ప్రవర్తనబట్టి మిగతా వారు
తమని తాము మలచుకోగలరు!.
వెయ్యికళ్ళ నిఘాతో
సీసీ కెమెరాలా
మిగిలినవారేం చేస్తున్నారని
ఎలా మాటాడుతారనే
డైట్ ట్రైనింగ్ ఆఫీసర్లా చెక్ చేసి
లాభనష్టాల బేరీజులో
కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ
తానే అయినట్టు భావిస్తూ...
అత్తగారికి హెచ్చరికల జారీ!!.
ఉమ్మడి కుటుంబనిర్వహణలో
తనవంతు పనికి
ఇతరుల వాటాకి
తేడా వస్తే తక్షణ చర్యలు!!.
పిల్లల్ని సైతం ఎవరెలా చూస్తారో
తరాజులో తూచి చెప్పే లౌక్యం
పంపకాల కోసం
పదేళ్లపాటు రిహార్సల్సు
దానా దీనా కొందరు
పల్నాటి నాగమ్మలైతే
మరి కొందరు
బొబ్బిలి మల్లమ్మ మరో రూపు!
ఆ తోడికోడలికి జేజేలు!!

-ఎం.వి.ఉమాదేవి

పూజల ఫలితం
తోటికోడళ్ళు ఇంటి మూలస్తంబాలు
ఇంటిని
ఇంటనున్నవారిని కనిపెట్టుకొని
ఆలనాపాలనా చూసే
దేవతామూర్తులు
అత్తమామలకు సంతృప్తిని
కూతుర్లవంటి అభిమానాన్ని పంచి
వారినుండి ప్రేమాదరణలు
పొందడంలో ఆనందం వర్ణించలేం
తమ బిడ్డలకు తన తరువాత
తల్లి వంటి ప్రేమ పంచేవారు
తన తోటికోడళ్ళే కదా
పుణ్యంకొద్ది పూజలుకొద్ది
దొరికే తోటి కోడళ్ళు
దైవ ప్రసాదం
తోడికోడళ్ళు అక్కాచెల్లెళ్లు
రక్తసంబంధం కంటే మిన్న
ఇంట తిరుగాడే మహాలక్ష్ములు వారే
అతిథి సత్కారాలు
ఇంటిమర్యాదా నిలిపే గౌరీదేవతలు
అదే ఆదర్శం
కొన్నికుటుంబాలలో కనిపించి
అందరినీ ఆనందపరిచే విషయం
అందరూ అలాగే
తోటి కోడళ్ళు కలసివుండాలి
ఆదర్శంగా నిలవాలి.

-ఆర్. రమాదేవి

## అక్కాచెల్లెళ్లు

వేరు వేరు మెట్టినిళ్ల నుండి
ఒకఅత్త వారింటికి వచ్చి
కలసి మెలసి
బాధ్యతలు బాధలు
పంచుకుంటూ
అన్యోన్నంగా మెలగుతూ
పెద్దలకు- అత్తామామలకు
గౌరవమిస్తూ
ఆడబిడ్డలను, మరుదులను
స్వంతబిడ్డల్లా చూసుకొంటూ
భర్తకు అన్యోన్యతను
ప్రేమను పంచి
స్వంత అక్కాచెల్లెళ్లను
మరపించే తోడికోడళ్ళు
ప్రేమాబాధ్యతలను
సరిచేసుకుంటూ వుండే
యిల్లే స్వర్గము
అటువంటి మనస్తత్వమున్నా
వారు అత్తవారింటికి వచ్చిన
ఆ పెద్దలుచేసుకున్నఅదృష్టం

## ఒకే ఇంటి రెండు కళ్ళు

ఒకే ఇంటి ముంగిట్లో
వేరువేరు నదులు
సఖ్యతతో కలిస్తేనే
ఆ ఇల్లు ఆనందాల కడలి
ఒకరు పెద్దమ్మ
మరొకరు చిన్నమ్మగా మారి
ఆలుమగల బంధాల నడుమ
ప్రేమానురాగాలు
ఒకే ఇంటి రెండు కళ్ళు
తోటి కోడళ్ళు.
గ్రామపట్టణమేదైనా
పెరిగిన వాతావరణం వేరైనా
మెట్టినింటి బాధ్యతల్లో
ఇద్దరిదీ ఒకే బాట.
కష్ట సుఖాలను పంచుకునేది
ఇద్దరిది ఒకటే
ఒకరికొకరు తోడుగా నిలిచే
తోటి కోడళ్ళు.
పోటీలు, పట్టింపులు
పక్కన పెడితే
ఒకే కుటుంబమిది.
ఆడపడుచుల కంటే
మిన్నగా మారే బంధమిది.
అత్తమామల సేవలో
పిల్లల పెంపకం లోగిలిది.
ఇద్దరూ కలిసి నడిపించే
సంసార నావ ఇది.
తోటి కోడళ్ళు అంటే
పరాయి వాళ్ళు కాదు.
ఇంటికి వచ్చిన
పరాయి అమ్మాయిలు కాదు...
ఆ ఇంటి గౌరవాన్ని
సంతోషాన్ని నిలబెట్టే రెండు కళ్ళు!
కుటుంబ గౌరవానికి తొంగి చూసే
ఇంటి ముంగిలి మెట్లు!.
వేర్వేరు ఇళ్లలో పుట్టి పెరిగినా
ఒకే గడప దాటి వచ్చిన దేవతలు!
అత్తారింటి దీపాన్ని వెలిగించే
ఒకే ఇంటి అందమైన రెండు కళ్ళు!.
అక్కలాగ ఒకరు ఆదరిస్తుంటే
చెల్లి లాగ మరొకరు అల్లరి చేస్తారు.
బాధ్యతలను ఇద్దరూ పంచుకుంటూ
ఆ ఇంటిని నందనవనంగా మారుస్తారు.
సుఖదుఃఖాల ప్రయాణంలో తోడుంటూ
కష్టాలెదురైతే
ఒకరికొకరు అండగా నిలుస్తారు.
ఒకరి చేతి వంటలో
మరొకరు రుచి చూస్తూ
ఆప్యాయతల అమృతాన్ని
ఇల్లంతా చల్లుతారు.
లోకం చూసే చూపులు ఏవైనా
ఈ తోటికోడళ్ళ బంధం
విడదీయరానిది.
ఒకరి మనసును మరొకరు
అర్థం చేసుకుంటూ ఉండే కుటుంబమిది.
ఆ వంశపు గౌరవాన్ని నిలబెట్టే పునాది.
ఈ రెండు కళ్ళు కలిసి నడిస్తేనే
ఆ ఉమ్మడి కుటుంబం
చిరునవ్వుల నిలయమౌతుంది!
అత్త కుటుంబం కోసం
శ్రమిస్తే
కోడళ్ళు రెండు కళ్ళలా
కనిపెట్టుకుని చూస్తే,
ఆ ఉమ్మడి కుటుంబం
విలసిల్లుతుంది ఒక కోవెలలా

-గుండవరం కొండల్ రావు

## ఉరికిస్రు

తోడుగా బయలెల్లె
టిక్కుటక్కు పక్కబెట్టి
కోకలు రైకలు రంగురంగులు
పెయ్యికి సుట్టి
డబడబ సప్పుడు బస్సెక్కి
లుంగీలు అంగీలకు
వంట ఇల్లు తోటి కోడలికి అప్పసెప్పి
ఉరికిస్రు జప్పుజప్పున
ఎక్కిస్రు బస్సు
పుస్కరాలకు మునిగేందుకు
పూజలు చేసెటందుకు.
ఇంటికాడ రోజూ ఝగడా
కుస్తీలతో నోటి దురుసుతో
పని చేసెటందుకు
నడ్డి వంగనమ్మలు
అత్తమ్మ కాడ తాబేలు నడకతో
వంకలు సెప్పెటోల్లు
ఎండలు సుర్రుసుర్రంటా
మాడ్సి సంపుతున్నా
ఎక్కిస్రు బస్సు.
ఇస్కూలు తాతీలుతో
పిల్లోండ్ల లొల్లితో
ఇల్లంతా లొల్లి
సెమటకి పెయ్యంతా సిటపటలు
మొగోల్లు చాయ్ టిపినంటూ
సతాయింపుడు
గ్యాస్ బండ గుదిబండాయె
లగ్గాలు, పెల్లిబిడ్డని సూడనీకని
ఇంటినిండా సుట్టాలు.
అందుకే ముద్దుగ ఒద్దికగ
కలిసికట్టుగ క్రికెట్ జట్టుగ
గిల్ట్ నగలేసుక
ఆధార్ కారట్లు
సంచీల పెట్టుక ఉరికిస్రు
ఇంటికాడ
ముక్కుమూతి ఇరిసినా
బైట అక్క సెల్లికన్న మిన్నగా
పుర్ మని ఎగిరిస్రు పిట్టలెక్క
తోటికోడలంటే
అదీ పక్కా ఓ అక్కా!

-ఎ.రాజ్యశ్రీ

## నవ్వు ఒక మెజీషియన్

జీవితమొక హాస్య నాటకం
పాత్రే దుఃఖబావిలో
నిండు బిందెలా మునిగిపోతుంటుంది.
కాలం కాకర తీగకి పూస్తున్న
జీవన్మరణాల పూలు రాలడానికి
యే నిర్దేశాలు వుండవు
వాటి కిటుకు ఎక్కడో ఊహాతీతం.
ఊరికే అలా
జారుడుబండ మీద గోలికాయలా
దొర్లిపడ్డవాళ్ళం
ఏటిపై విసిరిన రాయి
రెండో మూడో ఈతలు దాటి
మునిగిపోయినంత తేలిగ్గా
నిష్క్రమించేవాళ్ళం.
పట్టుకొడమే బాధని తెలిసినా
బ్రతుకువేరుని వదల్లేక
ఏడాదికోసారొచ్చే తిరుణాల్ల కోసం
ఎదురుచూసే పిల్లోడిలా
ఆనందంకోసం
జీవితాన్ని మోకరిల్లి అడుక్కుంటాం.
జీవితమేమో
ముట్టుకుంటే చిరిగిపోయేంత
పలచని ప్రేమవస్త్రాన్ని,
అల్లెం గుండంత బరువైన పుండుపిట్టని
భుజంమీద పైపంచలా కప్పుతుంది.
అప్పుడు
దుఃఖపు కోటగోడకి తలబాదుకుంటాం.
వేపచెట్టుకి తేనెతుట్ట కాసినంత మాత్రాన
కొమ్మలో చేదు తగ్గుతుందా
పుల్లని మజ్జిగలో ఎన్ని ఉప్పుకల్లులు వేస్తే
మాత్రం కమ్మదనం వస్తుందా.
జీవితం మనిషి గాయాల నీడ
ఆ౦ నీడలో రంగురంగుల
జీవన దృశ్యాలని గీయలేనప్పుడు.
రంగుబోయిన పాత కల శృతి చేస్తున్న
వెలితి వీణపై
స్థితప్రజ్ఞతని రవళించుకోవాళి
చెట్టుకి కాయ బరువైనా నవ్వాలి
కాయ వేర్లతో సహా
చెట్టుని తినేస్తున్నా నవ్వాలి
క్షతగాత్రుడి చిట్టచివరి ఆయుధం నవ్వే.
దోక్కబోయిన దెబ్బపై రాళ్లు విసిరినప్పుడల్లా
చీకటి వెలుగుల గుట్టు తెలిసినవాడిలా
తీరికైన నవ్వొకటి జేగంటలా నవ్వాలి
బెత్తానికి భయపడే ఆకతాయిలా
పారిపోతుంది
నవ్వంటే జీవితానికి మహా భయం.
నవ్వు వొక మిజీషియన్
దాని టోపీలో పావురాల్లే కాదు
పచ్చిగాయాలు కూడా
మాయమౌతాయి..!

-ఉదయగిరి దస్తగిరి
సౌదీ, 6305112187



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" వాట్సప్ గ్రూపులో డా॥ రావి రంగారావు నిర్వహిస్తున్న వారం వారం కవిత్వం వర్క్ షాపులో ఈ వారం కథల వర్క్ షాప్ లో విజేత పేర్లి దాసు కథ "ఉగాది పచ్చడి" నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకం.

-సంపాదకులు

## "ఉగాది పచ్చడి" కథ



ఉగాది ఉదయం.

పల్లెటూరి గాలి కొత్త సంవత్సరపు సువాసనతో నిండిపోయింది.

శ్రీనివాస్ ఇంటి ముందు మామిడి తోరణాలు వేలాడుతున్నాయి. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు. లోపల శ్రీనివాస్ భార్య ఉగాది పచ్చడి తయారు చేస్తోంది.

అప్పుడే బయట నుండి ఒక గొంతు వినిపించింది.

"శ్రీనూ ? ఇంట్లో ఉన్నావా?"

శ్రీనివాస్ బయటికి వచ్చి చూస్తే తనబీ చిన్ననాటి స్నేహితుడు అబ్దుల్.

"అరే అబ్దుల్! ఉగాది శుభాకాంక్షలురా!" అని ఆనందంగా పలికాడు శ్రీనివాస్ .

అబ్దుల్ నవ్వుతూ అన్నాడు:

"అసలు శుభాకాంక్షలు నీకే రా? కానీ ఒక పని ఉంది."

"ఏమిటది?" అని ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనివాస్. .

అబ్దుల్ చేతిలో ఒక చిన్న టిఫిన్ బాక్స్ ఉంది.

"మా అమ్మ నన్ను పంపింది. మీ ఉగాది పచ్చడి కోసం."

శ్రీనివాస్ ఆశ్చర్యంగా చూశాడు.

"మీరు కూడా గుర్తుంచుకున్నారా?"

అబ్దుల్ నవ్వాడు.

"అయ్యో? మేము చిన్నప్పుడు నీ ఇంట్లో ఉగాది పచ్చడి తిన్న రోజుల్ని మర్చిపోతామా?"

అప్పుడే శ్రీనివాస్ భార్య లోపల నుండి పచ్చడి తీసుకొచ్చింది.

"అబ్దుల్? ముందుగా నువ్వే తినాలి."

అబ్దుల్ కప్పు తీసుకుని ఒక్కసారిగా పచ్చడి తాగేసి

"అబ్బ .. అన్ని రుచులయందు ఈ యుగాది పచ్చడి రుచియే వేరయా .." అని పద్యం రూపంలో సాగతీస్తుంటే అందరూ నవ్వేశారు.

శ్రీనివాస్ అన్నాడు:

"ఇది జీవితం లాంటిదిరా?
వేపపూలు ? చేదు...
బెల్లం ? తీపి...
మామిడి ? పులుపు...
మిర్చి ? కారం...
జీవితం కూడా ఇలా అన్ని రుచులతో ఉంటుంది."

అబ్దుల్ మెల్లగా అన్నాడు:

"అవునురా? అన్నట్టు తీపి అంటే గుర్తుకు వచ్చింది... మీరు ఈమధ్య తిరుపతికి వెళ్ళారంటగా... మరి నా వాటా లడ్డు తీసిపెట్టారా లేదా ?"

"తీసిపెట్టకపోతే నువ్వూరుకుంటావా .. ఇదిగో నాయనా నీ వాటా " అంటూ శ్రీనివాస్ వాళ్ళ అమ్మగారు ప్లాస్టిక్ కవర్ లో ఉన్న తిరపతి లడ్డు ను అతని చేతికి అందిస్తు "చిన్నప్పుడు ఒకసారి ఎందుకో తిరపతి లడ్డు ఇవ్వలేదని ఎంతగోల చేశాడో అబ్దుల్ . అప్పటినుండి ఎప్పుడు తిరపతికి వెళ్లినా లడ్డు ఒకటి నీ కోసం ప్రత్యేకంగా తీసిపెడతాను" అన్నారు.

"ఎందుకో తెలియదు కానీ ఈ లడ్డులో ఉన్న రుచి నాకు మరెందులోనూ ఉండదు. . అంతిష్టం నాకు ఈ తిరపతి లడ్డూ అంటే .. మా అమ్మకు కూడా చాలా ఇష్టం!

మరి మన స్నేహం కూడా ఎప్పుడూ తీపిగానే ఇలాగె ఉండాలి.".. అంటూ లడ్డు ఉన్న కవర్ అందుకున్నాడు అబ్దుల్ .

అబ్దుల్ వెళుతూ వెళుతూ అందరితో చెప్పాడు

"మరో నాలుగు రోజుల్లో మా రంజాన్ పండుగ ... మీరందరూ రెడీగా ఉండండి మా ఇంటి సేమ్యా పాయసం , బిర్యానీ రుచి చూడటానికి ...అప్పుడు మళ్ళీ అందరం కలుద్దాం " అంటూ అందరి దగ్గరా సెలవు తీసుకుని "వెళ్ళొస్తా" అంటూ బయలుదేరాడు. .

శ్రీనివాస్ తన చేతిని అబ్దుల్ భుజంపై వేసి అన్నాడు:

"పండుగలు వేరు కావచ్చు?కానీ మన హృదయాలు ఒకటే."

అందరూ నవ్వుకుంటూ అబ్దుల్ కు వీడ్కోలు పలికారు .

ఉగాది పచ్చడి కేవలం రుచుల కథ కాదు?

మతసామరస్యానికి ఒక మధురమైన గుర్తు.

-సుభాని ఖయల్
9963833942

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



## నీ స్పర్శతో

నవమాసాలు మోసి నన్ను
కన్న అమ్మా
పురిటి బిడ్డనై నీ పొత్తిళ్ళ చేరగానే
నను అపురూపంగ తొలిసారి
హత్తుకున్న నీ స్పర్శతో
నువ్వే అమ్మవని తెలిసింది.
ఆప్యాయంగా ఒడిలోకి తీసుకుని
నీ చనుబాలు కుడుపగానే
నీప్రేమ మాధుర్యం తెలిసింది .
ఊయలలూపుతూ నీ చేతులలో
జోకొడుతూ నీవు జోల పాటలు
పాడుతుంటే నీ లాలలనలోని
మాతృత్వం తెలిసింది.
నా తప్పటడుగుల వేళ
నీ చేయి పట్టి నడిపిస్తూ
నా అడుగులు కందకుండా
నీ అరచేతులు పరచిన వేళ
నీ చేతిస్పర్శ లోని
మురిపెం తెలిసింది.
పైడిగిన్నెలో పాలబువ్వ పెట్టి
ఒడిలో చేర్చుకుని
గోరు ముద్దలు తినిపిస్తూ
చందమామ కథలన్నీ
వినిపిస్తుంటే
నీ ఒడి తప్ప వేరే ప్రపంచం
లేదనిపించింది.
అడుగడున నా చేయి విడువకనీ
ప్రాణాలన్నీ నాపైనే నిలిపి
నన్నింత వాడిని చేసిన
నీ చేతి స్పర్శతో ధన్యమైనది
అమ్మా ఈ జన్మ.

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

## ఆత్మ స్పర్శ..

పైపైన చూపించే జాలి మాటలు ఎందుకు?
ఒక్క నిరూపక స్పర్శే వంద మాటల పెట్టు.
దిక్కుతోచని స్థితిలో ఉన్నవాడి భుజం తట్టి,
"నేనున్నా" అనే నమ్మకాన్ని గుండెల్లో నాటు.
శరీరాల తాకిడి కాదు నిజమైన స్పర్శ అంటే,
ఒకరి ఆవేదనను మనసుతో తాకడం.
కన్నీళ్ల నదిలో మునిగిపోతున్న కళ్లను చూసి,
కరుణతో వారి చేతిని గట్టిగా పట్టుకోవడం.
నువ్వు పంచే ఆత్మీయమైన ఒకే ఒక్క స్పర్శ,
విరిగిపోయిన మనసులను మళ్లీ అతుకుతుంది.
బ్రతకాలనే ఆశ చచ్చిపోయిన మనిషిలో కూడా,
నూరేళ్ల ఆయుష్షును, కొత్త ఊపిరిని నింపుతుంది.
కులమతాల ముసుగు తీసి మనిషిని మనిషిగా చూడు,
అప్పుడే నీ స్పర్శకు ఒక సార్థకత దొరుకుతుంది.
సహాయం కోసం చాచే నీ చేతి స్పర్శలోనే,
నిజమైన దైవత్వం సాక్షాత్కరిస్తుంది.
ప్రపంచాన్ని మార్చడానికి యుద్ధాలు అవసరం లేదు,
ద్వేషాన్ని తుడిచేసే ప్రేమ స్పర్శ చాలు.
నీవు అడుగుపెట్టే ప్రతి చోటా మమకారాన్ని పంచి,
ఈ అవనిని ఒక నందనవనంగా మార్చేయ్ మిత్రమా!.

-టి. మహేష్ గౌడ్
నాగర్ కర్నూల్

## నీ స్పర్శతో

నీ స్పర్శతో నా మనస్సు
నవవసంపూలూపూసింద
ఆవసంతసుగంలా
పరిమలాలో
తీయనిస్వప్నలోకాలో
తేలీపోతుంది
ఆతీయనికళలుచేదరిపోనీయకూ
ఆనవ.వసంతపూలు
వాడిపోనీయకు
నీ స్పర్శతో చిగురించినజీవితం
మొడుగామార్చకూ
నీ చిరునవ్వుల చిలికేపన్ని
చినుకులు వేసి మొడునిచి
గురింపచేయూ
ఈ తీయని
కళ చేదరిపోనీయకుమా

-తాళ్లపూడి గౌరీ
రాయగడ,ఒడిశా

## మనసు తాకిన స్పర్శ

నీ స్పర్శతో
నా గాయాలన్నీ గాలిలో కలిసిపోతాయి.
అమ్మ ఒడిలో దొరికే ఆప్యాయతలా
నా అలసిన మనసు నీ దగ్గర నిద్రపోతుంది.,
నీ వేళ్ల తాకిడిలో
నాన్న ధైర్యం దాగి ఉంటుంది.
ఏ కష్టం ఎదురైనా సరే
"నేను ఉన్నాను" అనే భరోసా వినిపిస్తుంది.,
నీ భుజంపై తల వాల్చితే
ప్రపంచం మొత్తం మరిచిపోతాను
అది కేవలం ప్రేమ కాదు,
ఒక అమ్మాయి వెతికే ప్రశాంతమైన ఇల్లు.
నీ కౌగిలిలో
చిన్నపిల్లలా మారిపోతాను నేను
తల్లి ముద్దులో ఉండే మమతలా
నీ హృదయం నన్ను నెమ్మదిగా హత్తుకుంటుంది.
ఎవరూ అర్థం చేసుకోలేని నా మౌనాన్ని
నీ స్పర్శ ఒక్కటే చదువుతుంది?
కన్నీళ్లు రాకముందే
నీ చేతులు నా బాధను తుడిచేస్తాయి.
నీ స్పర్శతోనే
ప్రేమకి అసలు అర్థం తెలిసింది నాకు
భర్తగా కాదు?
ఒక అమ్మాయి మనసుకు
ఓదార్పైన ప్రపంచంగా మారిపోయావు.

- తనూజ వెంకట్
గౌరీబిదనూరు

# తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలి

-ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



పుస్తకావిష్కరణలో అతిథులు

తెలంగాణ చరిత్ర అస్థిత్వాన్ని కాపాడుకోవాలని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాటం ఆగిపోలేదని గతంలో పెత్తనం చెలాయించిన వారు తిరిగి ఆకాంక్షలను నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మన చరిత్రను నిలబెట్టుకోవడానికి రచనలు మరెన్నో రావాలన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రీలాన్స్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త డాక్టర్ నీలం సంపత్ రచించిన **సోషయల్ ఫర్ స్పెక్టివ్స్** పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ పుస్తకాన్ని ప్రొఫెసక్ కోదండరామ్ ఆవిష్కరించారు. నిరంతరం అధ్యాయనం ఉంటేనే వ్యాసాలు రాయడం సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయస్థానాలు కూడా ప్రశ్నార్థకంగా తీర్పులు ఇస్తున్నాయని, ఇక ప్రజాస్వామ్యానికే రక్షణ ఎక్కడ ఉంటుదన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ..దేశంలో ఎన్నికల వ్యవస్థ భ్రష్టుబట్టిపోయిందని ఆరోపించారు.

పుస్తకావిష్కరణ సభకు రచయిత డాక్టర్ ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించగా చీఫ్ సెక్రటరీ ఓఎస్‌డీ కె. విద్యాసాగర్‌రావు, ఏఐఎఫ్ఆర్‌యూసీటీవో ఫైనాన్స్ సెక్రటరీ ఆర్విణి రాజేంద్రబాబు, మాజీ జాతీయ కార్యదర్శి ఎ. పుల్లయ్య, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఏవీవీ ప్రసాద్, కృష్ణమూర్తి, పుస్తక రచయిత డాక్టర్ నీలం సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆవిష్కరణ సభ తెలంగాణ తెలుగు పరిశోధక మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు.






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

# కలర్స్ ఆఫ్ ఇన్నోసెన్స్ - ఎ మూవీ

మా తాత నన్నూ, అన్యని, విదూను తన గదిలోకి పిలిచారు. మీ మాటలు వింటున్నాను. మీ ఆర్టికల్స్ చదువుతున్నాను. ముఖ్యంగా ఛాప్లిన్ మీద మీరు మీ భావాలు చెప్పారు. ఇప్పుడు నేను ఓ మంచి సినిమా చూశాను అన్నారు.

"ఏం సినిమా అది. అంత గొప్పగా వుందా?" అన్నాను.

"అది మీరు చెప్పాలి. సహజంగా వుంది. అది మలయాళీ సినిమా" అన్నాడు తాత.

అప్పుడు మా ముఖాల్లో కనిపించిన మార్పును గమనించాడు.

"ఒకప్పుడు ఆ భాషలో సినిమాలు నేషనల్ అవార్డులు సాధించేవి. అంతదాకా ఎందుకు మన నటి 'శారద'కు ఆ భాషలో మూడు సార్లు జాతీయ ఉత్తమ నటిగా 'ఊర్వశి' పురస్కారం వచ్చాక మనవాళ్ళు తనని గుర్తించారు. తర్వాత కొంతకాలం 'ఎ' సర్టిఫికెట్ సినిమాలు రాజ్యం ఏలాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా మంచి సినిమాలు వస్తున్నాయి. అలాగే కమర్షియల్ మూవీలు కూడా వస్తున్నాయి. ఇది అన్ని భాషల్లోనూ వుంది కదా!" అన్నాడు తాత.

"మన తెలుగు వరకు నేను మాట్లాడతాను. ఇక్కడ నూటికి తొంభై ఎనిమిది సినిమాలు బడా వ్యాపార సినిమాలు. ఒకటో రెండో గుడ్ మూవీస్ వస్తాయి. అలాంటివి వచ్చాయని జనానికి తెలిసేలోపు వెళ్ళిపోతాయి. మీలాంటివారు చెబితేనే ఓ.టీ.టీ.లో చూడవచ్చు" అంది అన్య.

"తాతా! మీకు ఈ సినిమా నచ్చకపోతే మాకు చెప్పరు. మీకు ఏం నచ్చింది?" అడిగాడు విదు.

"అది మలయాళీ సినిమా అన్నాను. పేరు ఏదో వుంది. అయితే బ్రాకెట్లో 'కలర్స్ ఆఫ్ ఇన్నోసెన్స్' అని ప్రకటించారు. ముందుగా మీకు చెప్పేది ఏమిటంటే మీరు రకరకాల విషయాల గురించి మాట్లాడుతున్నారు. అప్పుడప్పుడు మంచి సినిమాల గురించి కూడా చెప్పండి. అప్పుడే పది మందికి తెలుస్తుంది. ఏమంటారు?"

మేం ముగ్గురం అంగీకార సూచనగా తలలూపాం.

"ఇది పిల్లల కథ. ఇద్దరు అన్నదమ్ముల కథ. ఇదో పేద కుటుంబం కథ. మీకు క్లుప్తంగా చెబుతాను. ఈ ఇద్దరి అబ్బాయిల్లో అన్న పేరు గోపాల్. తమ్ముడు చింటూ. చింటూలో అమాయకత్వం వుంది. వాళ్ళ నాన్నను ఓ ట్రక్ గుద్దేసింది. అతను చావు బతుకుల మధ్య ఇంట్లో మంచం మీద వున్నాడు."

"ఇద్దరి వయసు ఎంత?" అంది అన్య.

"పెద్దవాడికి పది సంవత్సరాలు దాటతాయి. చింటూ రెండు మూడు సంవత్సరాలు చిన్నవాడు కావచ్చు. చేపలు పట్టటానికి వెళ్తారు. 'నాన్న బతుకుతాడంటావా అంటాడు చింటూ. ఏమో అంటాడు గోపాల్. చేప గాలానికి పడదు గాని ఆ కర్ర మధ్యకు విరిగిపోతుంది. అన్నయ్యను ఆట పట్టిస్తాడు చింటూ.

కనీసం భోజనం చేసే అవకాశం లేదు. స్కూల్‌కి గోపాల్ వెళ్తాడు. అదీ మానేయాల్సి వస్తుంది. వాళ్ళ అమ్మ చుట్టుపక్కల వారితో ఇంక నేను అప్పులు చేయలేను. ఈ కుటుంబాన్ని పోషించటం నావల్ల కాదు. నేను చచ్చిపోతాను అంటే చుట్టుపక్కల వారు వారించి పిల్లల సంగతి ఆలోచించు అని ఓ పెద్దావిడ అన్నం కూరలు పంపిస్తుంది. ఇలా ఎంతకాలం? ఆమెకు వంట చేసే పని కుదుర్చుతాను అంటుంది.

అప్పుడు గోపాల్‌కి ఓ కల వస్తుంది నాన్న చనిపోయినట్లు. కుండ అతని పక్కన వుంటుంది. అమ్మ పరుగులు తీసుకుంటూ వెళ్తుంది. వెంటపడతాడు. తనని రాయితో కొడతానని బెదిరించి, తన చీర ఊడుతున్నా పరుగులు తీసుకుంటూ రైలు కింద పడి చనిపోయినట్లు. ఉలిక్కిపడి లేస్తాడు. వణికిపోతాడు.

అప్పుడు ఓ నిర్ణయానికి వస్తాడు. తను చెరువు ప్రాంతానికి వెళ్తాడు. అక్కడ ఆకుకూరలు పెరుగుతుంటాయి. అలాగే తాటి చెట్లనుండి రాలిన పండు దొరుకుతుంది. అవన్నీ సంతలోకి తీసుకువెళ్ళి అమ్ముతాడు. కొంత ఆత్మవిశ్వాసం వస్తుంది. అప్పుడే శ్రీకృష్ణ జన్మాష్టమి రానుందని ఆ ఊర్లో వున్న ధనిక కుటుంబం అది ఘనంగా నిర్వహించి ఊర్లో అందరినీ పిలిచి బ్రహ్మాండమైన విందుని ఇస్తున్నారని తెలుస్తుంది.

గోపాల్ చింటూతో వారి ఇంటికి వెళ్తాడు. విశాలమైన భవనం. అక్కడ ఆ ఇంటి యజమాని వస్తుంది. తను నాలుగయిదు తాటి పండ్లను తీసుకురాగలను అంటాడు. ధర అడిగితే చెబుతాడు. ఇవి పూజకు కాబట్టి పవిత్రంగా బాగుండాలంటే తలూపుతాడు.

బయటకు వచ్చాక చింటూ మనం డబ్బులు తీసుకుంటే విందుకి పిలవరు. ఉచితంగా ఇద్దాం అంటే గోపాల్ కోప్పడతాడు. మనం డబ్బులు తీసుకుందాం అంటాడు. జన్మాష్టమి దగ్గరకు వస్తుంటే ఆరోజు భయంకరమైన వాన. చింటూ పాత గొడుగు తీసుకుని ఒంటరిగా వెళ్ళి నాలుగు తాటిపండ్లు సేకరించి ఆ యజమాని దగ్గరకు వెళ్తాడు. వాటిని చూసి ఆమె చాలా బాగున్నాయి అని డబ్బులు ఇవ్వబోతే వద్దు అంటాడు. జన్మాష్టమి అంటే ఏమిటి అంటే హ్యాపీ బర్త్‌డే అంటే అదేంటంటాడు. అది కృష్ణుడి పుట్టినరోజు అంటుంది.

ఇంటి దగ్గర అమ్మ, అన్నయ్య ఇద్దరూ చింటూని కొడతారు. వానలో తడిస్తే జ్వరం వస్తే నిన్ను ఆసుపత్రికి ఎవరు తీసుకువెళ్తారంటూ. అన్న నిన్ను ఉచితంగా ఎవరు ఇవ్వమన్నారని కొడతాడు. జన్మాష్టమి వస్తుంది. ధనిక యజమాని నౌకరు ఇల్లు వెతుక్కుంటూ వచ్చి పిలుస్తాడు. అక్కడ బ్రహ్మాండమైన పూజ, ముఖ్యంగా ఎప్పటినుండో తినాలనుకుంటున్న పులావ్. అమ్మని అడిగితే ముందు మామూలు అన్నం తింటే అదే గొప్ప అంటుంది. అంతకుముందు అందరితో పాటు చింటూకి కొసరి కొసరి పులావు వడ్డిస్తారు. అది తింటున్నప్పుడు చింటూ కళ్ళల్లో ఆనందం. అమ్మా, అన్నయ్య గుర్తు వస్తారు" అని ఆగాడు తాత.

"బాగుంది" అన్నాం ముగ్గురం.

"కథ అయిపోలేదు. ఇది కల కాకూడదు అనుకుంటూనే వున్నాను. తీరా చూస్తే అది కల. వారిని పిలవలేదు. అందరినీ పిలిచారు. వాళ్ళ నాన్న రిక్షా లాగుతాడు కాబట్టి పిలవలేదని ఫ్రెండ్స్ అంటారు. చివరకు అన్నదమ్ములు ఊరవతల చేల దగ్గర పడుకుని ఆకాశం కేసి చూస్తుంటారు.

గోపాల్ నీకు ఎవరంటే ఇష్టం అంటాడు. నాన్న, అమ్మ అంటాడు చింటూ. నేనో అంటాడు. నువ్వు కూడా అంటాడు చింటూ. మరి నీకు అంటాడు గోపాల్‌ని. నాన్న, అమ్మ, నువ్వు. నేను ఏం చేసినా, సంపాదించినా అందులో సగం నీకు ఇస్తాను అంటాడు. ఇద్దరి నవ్వుల మధ్య సినిమా ముగుస్తుంది" తాత ముగించాడు.

ముగ్గురం ఆలోచనల్లో పడ్డాం.

"ఇలాంటి సంఘటన మా జీవితంలో వుంది. నా తమ్ముడుకి, నాకూ మధ్య జరిగింది. అది ఓ నవలలో రాశాను" అన్నాడు తాత.

"అది మాకు చెప్పు తాతా" అన్నాం.

"ఇప్పుడు కాదు. మరోసారి చెబుతాను. ఈ సినిమా చూస్తుంటే మా చిన్నతనం గుర్తు వచ్చింది. పల్లెటూర్లు, అక్కడి పేదరికం గుర్తు వచ్చాయి. మీరు నగరాల్లో వుంటున్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు వున్నాయి. మీరు ఆ ప్రాంతాలకు వెళ్తే మీకు ఎన్నో కథలు దొరుకుతాయి" అన్నాడు తాత.

మేం తప్పకుండా వెళ్తాం. మా తాత కథ కూడా ముందు ముందు మీకు చెబుతాం. మళ్ళీ కలుద్దాం. బై.

# 'ప్రపంచ శాంతి'పై కవి సమ్మేళనం



గానసభలో కవులు, కవయిత్రులను సన్మానించిన అతిథులు

హైదరాబాద్, జూన్ 3:(నేటినిజం ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం త్యాగరాయ గానసభలో కవి సమ్మేళనం జరిగింది. ప్రపంచ శాంతి అంశంపై పలువురు వర్ధమాన కవులు స్వీయ కవితలు చదివారు. ప్రముఖ సాహితీవేత్త పెద్దూరి వెంకటదాసు, ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, మౌనశ్రీ మల్లిక్, శైలజామిత్ర, రఘువీర్ ప్రతాప్, ఉప్పల రాధాకృష్ణ, మిద్దె సురేష్, రవూఫ్, గూడూరు విజయ లక్ష్మి, మల్లాది విజయలక్ష్మి, శోభాపాండే, అరుణకుమారి పాల్గొన్నారు.



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం"లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## విశ్వా'స' మోసాలు !

ప్రేమ
ప్రేమగా పంపుకో మూగ సందేశం
ప్రేమ గుడ్డిదే గదా!
గుండె లోపల చదువుకుంటది
గుంపులో ఉన్నా గుట్టు రట్టు కాదు !.

**ఆటు - పోటు**
అమావాస్య పుణ్ణాలు
ఆరోహణ అవరోహణ క్రమాలు
ఆపద - సంపదలు
అనుకోని ఆటు- పోటులు!!

**స మోసాలు**
అడుగడుగునా విశ్వా స
మోసాలు!
ఆధునిక ఆవాసాలు
వాసాలు లేని నివాసాలు !!!

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## ఆకలి గారడి

గారడోడు డప్పుకొట్టుకుంటా
కోతులను ఆడిస్తుంటే
సూడనీకి మనకు గమ్మత్తే !!.
గారడోని కడుపుల పేగులను
ఆగమాగంగా ఆగకుండా
ఆకలి ఆటాడిస్తున్నది !!.
ఆకలిని మిథ్యా చేసుడుకే
చౌరస్తాల ఈ గారడీ విద్య !.
గారడోడు తినాలే !
వాడి కుటుంబం తినాలే !
కోతులూ తినాలే !!
చిన్నదేం కాదు-
గారడోడి కుటుంబం పెద్దదే మరి!!

-కందాళై రాఘవాచార్య
8790593638

## మూడో కన్ను

పైసలిస్తేనే ఓటేస్తమంటు
ప్రజాస్వామ్యాన్ని
అమ్ముకుంటున్న జనం
పదవికై
పెట్టుబడిగ
ఓటును కొనుకుంటున్న నాయకులు
మారనంత కాలం ఎవ్వరికీ వారే
ఆత్మవంచన చేసుకోవడమే.
రాజ్యాన్ని ఎవ్వరు ఏలిన
అప్పులు చేసేది దేశం పేరుమీదే
దేశమంటే మనుషులమేనని
అప్పులు చేస్తుంది
ఓటు బలంతోనే నని
జనం గ్రహించేదెపుడో.
పాలకులు చేసిన,చేస్తున్న అప్పులకు
బతికినంత కాలం పన్నులు
చెల్లించేది మనమే ఐనప్పుడు
అప్పులు మనమేచేస్తున్నమని
ప్రజలే ప్రభుత్వమని ఎరగనంత కాలం .
పాలకులను కమీషన్ ఏజంట్లుగ
నియామకం చేస్తూ
అమ్ముడు పోతున్నది ఓటే
ప్రలోభాలకు లోనైనప్పుడే
అక్రమ దారుల నెంచుకుంటది
దేశాన్ని ఆర్థిక మాంద్యంలోకి తోసేది
అనాలోచన ఓటేనని మరవద్దు.
పారిశుద్యం పేరున ఫోటోలకు
పోజులిచ్చే పాలకులు
పీడితప్రజల ఆకలి బాధలను విస్మరించి
విశ్వంతో పోటీ పడుతున్నమని
అప్పులతో విగ్రహాల కొప్పులు పెడుంటే
నాకెందుకులే అన్నట్టు
అచేతనమైన యువత
మూడొకన్ను తెరిచేదెప్పుడో.

-యరకల యాదయ్య.
9866468979.

## ప్రాణం ఎంత తల్లడిల్లి పోతుందో

శ్రమని ఆయుధంగా చేసుకొని
పంటలు పండించే రైతుకు
సరైన సమయంలో
పురుగుమందులు దొరకక
పంట చేను మొత్తం
పురుగులకు ఆహుత అయినప్పుడు
రైతు ప్రాణం ఎంత తల్లడిల్లుతుందో.
అందరి ఆకలి మంటలను తీర్చేవాడు
రైతు అయితే
తన పంట చేతికి వచ్చాక
తరలింపుకు రవాణా సదుపాయం లేక
తన పంట వర్షానికి బలి అయినప్పుడు
తన ఆకలి దప్పికలను ఆర్పే నాథుడు లేక
రైతు ప్రాణం ఎంత తల్లడిల్లిపోయిందో.
దేశానికి రైతే రారాజు అంట
కానీ తన పంటను సరైన మద్దతు ధర లేక
తన భార్య పిల్లలను పోషించలేక
బీదరాజు రైతుగా మిగిలిపోతున్నప్పుడు
రైతు ప్రాణం ఎంత తల్లడిల్లి పోతుందో.
రైతే దేశానికి వెన్నెముక అనే నినాదాన్ని
రైతు గెలిచినప్పటికీ
తన శ్రమకు గౌరవం దొరకక
త్యాగరాజు రైతుగా మిగిలినప్పుడు
రైతు ప్రాణం ఎంత తల్లడిల్లి పోతుందో.

-టి.విశాలాక్షి

## రాలుతున్న పూలు

కొమ్మను వీడి
నేలను చేరేటప్పుడు
పూలు తమ పరిమళాలను
వీడ్కోలుగా పంచుతాయి!
జీవితం ముగిసిపోతున్న క్షణంలోనూ
మరో కొత్త సుగంధాన్ని
లోకానికి మిగుల్చుతాయి.
గాలులతో పోరాడి
అలసిపోయిన ఒక పువ్వు
రెమ్మను వదిలి నేలను ముద్దాడింది
ఓడిపోలేదు అవి
భూమాతలో చేరి
రేపటి చిగురుకు మళ్ళీ ప్రాణం పోసింది
విచ్చుకున్న ప్రతి పువ్వు
ఏదో ఒకరోజు రాలాల్సిందే!.
ఈ ప్రకృతి ఒడిలో
మరణం కూడా ఒక అందమైన ప్రయాణమే
రాలిపోయే పూలని చూసి బాధపడకు నేస్తమా
ప్రతి రాలే పువ్వు
మరో కొత్త వసంతానికి నాంది పలుకుతుంది
చిరుగాలి తాకిడికి జారిపడిన పువ్వు
తనతో పాటు లోకానికి
ఒక పాఠం చెబుతుంది
వికసించినంత కాలం
నవ్వుతూ జీవించుఅని
రాలిపోయేటప్పుడు మౌనంగా
వీడ్కోలు పలుకుతుంది
రాలే పూల సువాసన చెదిరిపోదు
అది గాలిలో కలిసి చిరకాలం నిలిచిపోతుంది.
తల్లి కొమ్మను వీడిన ప్రతి పువ్వు
మట్టితో మమేకమై
మరుజన్మకు సిద్ధమవుతుంది
జీవితపు అర్థాన్ని రేకలపై రాసి
ప్రకృతి పుస్తకంలో ఒక పేజీని
పూర్తిచేసి వెళ్ళిపోతుంది.

-పి.మృదుల

## సూర్యుడు

సౌర కుటుంబానికి
సూర్యుడే పెద్ద
అతనికి ఆత్మాభిమానం ఎక్కువ
అందుకే అతను ఎవరిపై ఆధారపడడు
తన భావోద్వేగాలను
ఇంద్రధనస్సు ద్వారా వ్యక్తపరుస్తాడు
సూర్యుడు,రవి, ఉదయ్, ప్రకాష్, భాస్కర
వంటి పేర్లతో అందరినోట్లో నానినవాడు
సూర్యుడే మొక్కలకు ఆధారం
అతను లేకపోతే అన్నం లేదు,వర్షాలు లేవు
డి విటమిన్ లేదు,సౌరశక్తి లేదు
అసలు ఎవరికీ మనుగడే లేదు
భూగోళానికి ప్రాణమిచ్చిందే తను
సూర్యుడు పరోపకారి
అన్ని గ్రహాలకు సూర్యకాంతిని పంచుతాడు
సూర్యుడిది అమ్మ ప్రేమ
కరుణిస్తే ఆదరిస్తాడు
సూర్యుడిది నాన్న కోపం
తేడావస్తే బూడిద మిగుల్చుతాడు

- ప్రవళిక

## తెలంగాణ నేల

బంగారు నేలయిది
బ్రతుకు జూపినదిది
పరదేశి యైనను
పలకరించిన నేల.

గంజి గడకలతోని
కడుపులు నింపుకొని
కన్నవారిని పోషించి
గౌరవ మందిన నేల.

పాల్కురికి సోమన్న
బమ్మెర పోతన్న
కంచర్ల గోపన్న
మల్లి సూరనయన్న.

తెలగాన ప్రాచీన
కవి శేఖరుల గన్న
దివ్య తేజో మూర్తి
తెలగాణకు తల్లి.

ఎములాడ రాజన్న
యాదాద్రి నరసన్న
కొమురెల్లి మల్లన్న
కొండగట్టంజన్న.

కొలువైన దేవుళ్ళు
కొంగు బంగారమై
కోట్లాది జనులకు
ఆరాధ్య దైవాలు.

కుమ్మరైనను గాని
కమ్మరై నను గాని
చాకలైనను గాని
మంగలైనను గాని.

కర్షకులు కార్మికులు
కులభేదములు లేక
కష్టాలు పంచుకొని
కాలము గడిపిరట.

నేటి కాలమునందు
రాజకీయములాయె
కుల మతమ్ములలోన
గొడవలు చెలరేగె.

పార్టీల పేరుతో
ప్రజలంత విడిపోయి
ప్రతిరోజు పల్లెల్లో
ఘర్షణలు చెలరేగె.

కలిసి జీవించండి
ఐక్యతను పెంచండి
తెలంగాణ ఘన కీర్తి
నలు దిశల నింపండి

-నర్సింగోజు లక్ష్మయ్య
హన్మకొండ

# కవి సాయంత్రం (సోషల్ మీడియా గ్రూప్)రచనలకు ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 3:(నేటినిజం ప్రతినిధి) "జనజాగృతి కళాసమితి" లో అంతర్భాగమైన "కవి సాయంత్రం" గ్రూప్ 2026 ఆగస్ట్ లో నిర్వహించనున్న 9వ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా మరొక ప్రత్యేక కవితా సంకలనం ఆవిష్కరించనున్నది. ఈ సంకలనం కొరకు గ్రూపు సభ్యులతో పాటు ఔత్సాహికులైన ఇతర కవులు/ కవయిత్రుల నుండి రచనలను ఆహ్వానిస్తున్నాం. అంశం: ఐచ్చికం ప్రక్రియ: కవిత్వం (లేదా), పద్యం (లేదా), గేయం. 1. ఒకరు ఏదైనా ప్రక్రియలో 1 రచన మాత్రమే పంపాలి 2. 25 లైన్లకు మించరాదు 3. ఈ సంకలనం కోసమే ప్రత్యేకంగా రాసినవి మాత్రమే పంపాలి. 4. ఇతర గ్రూపులకు, పోటీలకు, పత్రికలకు పంపినవి, సోషల్ మీడియాలో పబ్లిష్ అయినవి ఈ సంకలనానికి పంపించవద్దు. 5. రచనతోపాటు ఈ హామీ తప్పకుండా రాయాలి. 6. ఫోటో, పూర్తి అడ్రస్ తప్పకుండా పంపించాలి. 7. ఈ సంకలనం ముద్రణ పరస్పర సహకార పద్ధతిలో ఉంటుంది. 8. ఆత్మీయ సమ్మేళనంలో ఆవిష్కరించి, కవి/ కవయిత్రిని సన్మానించి సంకలనం బహూకరించబడును. 9. పై విషయాలన్నీ అంగీకరించినట్లయితే మీ రచన క్రింది నెంబర్ కి వాట్సాప్ లో 944179720710కు పంపించగలరు. రచనలు చేరడానికి **ఆఖరి తేదీ: 15.06.2026,** రాత్రి 10 గం. ఇట్లుముక్కెర సంపత్ కుమార్ వ్యవస్థాపకులుజనజాగృతి కళాసమితిహుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

# బుచ్చిబాబు రచనల్లో ఆంగ్ల సాహిత్య ప్రభావం




సమావేశంలో మాట్లాడుతున్న శంకర నారాయణ. వేదికపై బండి శ్రీనివాస్, శైలజామిత్ర, కళా జనార్ధనమూర్తి, గాయని అన్నపూర్ణ

హైదరాబాద్, జూన్ 3:(నేటినిజం ప్రతినిధి) ప్రముఖ రచయిత బుచ్చిబాబు రచనలలో భారతీయ తాత్త్వికతతో పాటు ఆంగ్ల సాహిత్య ప్రభావం కనిపిస్తుందని జర్నలిస్ట్ శంకర నారాయణ అన్నారు. తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు రచనలైన కథ, నాటకం, నవల వేటికి అవే ప్రత్యేకం అని అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం బుచ్చిబాబు యాదిలో సమావేశం నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశం లో ముఖ్య అతిథిగా శంకర నారాయణ పాల్గొని మాట్లాడారు. బుచ్చిబాబుగా పేరొందిన శివ రాజు వెంకట సుబ్బారావు ఎన్నో కథలు, నాటకాలు తెలుగు సాహితీప్రియులకు అందించారన్నారు. బుచ్చిబాబు మంచి చిత్రకారుడు అని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలకవర్గ సభ్యుడు బండి శ్రీనివాస్, రచయిత్రి శైలజామిత్ర, గాయని అన్నపూర్ణ పాల్గొన్నారు.



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## ఆది దేవత

ఆది దేవత అమ్మ...
నా చేత తలరాతను మార్చేఅక్షరాలు దిద్దించిన శారదాదేవి,
నా భవితకు కలలుగన్న బంగారుబాటను సిద్ధం చేసిన పార్వతిదేవి,
నాలో అజ్ఞానమనే అంధకారాన్ని రూపుమాపిన సరస్వతీదేవి ,
నా విజ్ఞానానికి అవధులు లేని గమ్యం వేసిన గురువు,
నా మేధో సంపత్తికి అంతేలేని పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయిని,
నా జీవన ప్రమాణాలకి ఊహించని ప్రతిఫలం చూపిన తత్వవేత్త,
నా ఆలోచనా సరళిని సన్మార్గంలో నడిపిన దిక్సూచి,
నా ఆవేదనా తరంగాల గమనం మార్చిన శ్రేయోభిలాషి,
నాకు ప్రేమానురాగాలు పంచే వారధిగా మారిన ఆత్మీయపెన్నిధి,
నాకు వెల కట్టలేని ఆదరాభిమానాలను పంచే ఆత్మీయురాలు,
నా అలసటలో విసిగి వేసారకుండా అక్కున చేర్చుకున్న కల్పతరువు,
నా ఆనందంలో తన వంతు పాలు పంచుకున్న స్నేహితురాలు,
నా కవితా దృక్పథానికి చక్కని పునాది వేసిన కామధేనువు,
నా కవితల పూలకు పరిమళాలద్దిన తోటమాలి,
నా ఊహలకు ఊపిరి,
నా ఆశలకు ఆయువు... అన్నీ అమ్మే.... ,
నన్నే నాకు కొత్తగా పరిచయం చేసిన అమ్మా...!
నీకిదే నా వందనమమ్మా...
నా అక్షర నీరాజనం అందుకొనుమమ్మా...!!

-భూపతి సుమశ్రీ
+91 85007 89389

## కలల సౌధము

కలలతో మొదలవుతుంది ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది ప్రతి హృదయం.
చిన్న కల అయినా చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో వచ్చే చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే నక్షత్రాలు అవి.
పడి లేస్తూ సాగిన ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో
వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో
కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో
మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్నీ దాటించే పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.
అందుకే యువత హృదయంలో
కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని పిలుస్తూ,
మన భారతాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దాలి

-కె. కె. రామచందర్
.+91 94934 02139

## జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాదలొచ్చాయని భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని ముందే ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆపకు నీ పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని
బాధపడుతూ కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని
నమ్మకం పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు భరోసాగా నిలిచే ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు ఇన్ని
బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో
సుడి గాలులు ఎన్ని వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో మంచి స్థానం లభిస్తుంది.

-మోదేపల్లి శీనమ్మ
+91 97048 54615

## మన చేతల్లోనే ఉంది అంతా

పచ్చ పచ్చని చెట్లతో
గలగల పారే నదులతో
కిలకిల రావాల పక్షులతో
పుడమి పాడింది ప్రకృతి రాగం నాడు.
యంత్రాల ఘోషల్లో
కాలుష్య కోరల్లో
ప్లాస్టిక్, విషవాయుల కౌగిట్లో
పుడమి నలుగుతుంది నేడు.
మనుషిలో పెరిగే స్వార్థం
చెట్లను నరుకుతున్నాడు
అడవులను ఆక్రమిస్తున్నాడు
నదులను కాలుష్యం చేస్తున్నాడు.
జాలువారే జలపాతాలు కనుమరుగాయే
ఋతువుల రాగం గతితప్పె
పకృతి పగపట్టే.
నాణానికి ఇరువైపులాన్నట్లు
హరిత శోభ ఓవైపు
మసిబారిన మసక ఓవైపు
మన చేతుల్లోనే ఉంది పుడమి తల్లి ఆయతి.
చెట్లను నాటు కాలుష్యం నివారించు
నదీ జలాలు కాపాడు
ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టు
జీవజాతులను కాపాడు.
ఓ మనిషి స్వార్థం వీడు
పకృతితో మమేకమవ్వు
స్వచ్ఛమైన గాలులు పీలుద్దాం
భవిష్యత్తరాలకు అందిద్దాం.

-చాగంటి రాణి, +91 83677 49366

## కోరికలే గుర్రాలైతే

మనిషికి ఆశ ఉండొచ్చు
కానీ అత్యాశ ఉండరాదు
రేరాశ అసలే ఉండకూడదు
దురాశ దుఖఃనికి చేటు!.
మనిషి కి కోరికలు ఉండడం
సహజం కానీ అవి నెరవేరే లా
ఉన్న వాటినే ఎంచుకోవాలి
మనసును నియంత్రణలో ఉంచాలి!.
అందని ద్రాక్ష పండ్ల కోసం
అర్రులు చాచొద్దు మనమెంత
అందుకోగలమె? తెలుసు కోవాలి
కోరికల ఒడ్డు ను చేరు కోవాలి!.
చూసినవన్నీ కావాలంటాయి కళ్లు
కోరికలన్నీ తీర్చాలంటుంది మనసు
దేని మాట విన కూడదు తనువు
శక్తి కొద్దీ బ్రతకడం నేర్చు కోవాలి!
దురాశ తో ఏ పనీ చేయ కూడదు!,

-ఉమాదేవి ఎర్రం
+91 80083 87358

# ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

వరంగల్, జూన్ 3:జిల్లాలోని ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి పై అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్), కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అడ్మిన్ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతుల మెరుగుదలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్,కమిటీ కన్వీనర్ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.